www.epaper.asthramdaily.com

RNI : TGTEL/25/A1872

సామాన్యుడి అస్త్రం

తెలుగు దిన పత్రిక

సంగారెడ్డి- హైదరాబాద్ | శనివారం, అక్టోబర్31,2026 | ఎడిటర్: పి. జయరాం | సంపుటి: 1 | సంచిక:250 | పేజీలు: 8 | వెల: రూ.5/-

క్రిప్టో మార్కెట్‌లో కలకలం..

ప్రపంచంలోనే అతిపెద్ద క్రిప్టో కరెన్సీ ఎక్స్ఛేంజ్ బైనాన్స్ కీలక నిర్ణయం తీసుకుంది. భద్రతా ఉల్లంఘన ఘటనపై దర్యాప్తు చేపట్టిన నేపథ్యంలో డిపాజిట్లు, విత్‌డ్రాలను తాత్కాలికంగా నిలిపివేసింది. ఈ ఘటన వల్ల సుమారు 6.3 బిలియన్ డాలర్ల (దాదాపు రూ. 6 లక్షల కోట్లు) మేర ప్రభావం ఉండొచ్చని ప్రాథమికంగా అంచనా వేసింది. తొలుత జరిపిన విచారణలో ఓ డెవ్‌ఆప్స్ ఇంజినీర్ ల్యాప్‌టాప్ హ్యాక్ అయి ఉండొచ్చని బైనాన్స్ తెలిపింది. దాని ద్వారా దుండగులు ఓ సర్వీస్ కంటైనర్‌లోకి ప్రవేశించి, అనధికారికంగా నగదు ఉపసంహరణ లావాదేవీలకు ప్రయత్నించినట్లు పేర్కొంది. అయితే క్రిప్టో వాలెట్లకు సంబంధించిన ప్రైవేటు కీలు లీకైనట్లు ఎలాంటి ఆధారాలు లభించలేదని స్పష్టం చేసింది. ఈ ఘటనతో ప్రభావితమైన ఆస్తులను నిలిపివేసేందుకు బ్లాక్‌చైన్ భాగస్వాములతో కలిసి పనిచేస్తున్నట్లు సంస్థ వెల్లడించింది.

రూ. 26 కోట్ల సైబర్ ఫ్రాడ్ కేసు

- హైదరాబాద్‌లో మూడు ప్రాంతాల్లో ఈడీ సోదాలు
- అల్లంరాజు సత్యనారాయణమూర్తి ఆస్తులే లక్ష్యంగా దాడులు

02



సింగరేణి కార్మికులకు మరో బోనస్

- సింగరేణి కార్మికులకు దీపావళి బోనస్ ప్రకటించిన ప్రభుత్వం
- ఒక్కొక్కరికి గరిష్ఠంగా రూ. 1.10 లక్షల చొప్పున చెల్లింపు

02



హైదరాబాద్‌ను ముంచెత్తిన భారీ వర్షం

- హైదరాబాద్‌ను ముంచెత్తిన కుండపోత వర్షం
- ప్రధాన రహదారులన్నీ జలమయం

02





02

లాభాల్లో ముగిసిన స్టాక్ మార్కెట్లు

- సెన్సెక్స్ 308.49 పాయింట్ల లాభం
- నిఫ్టీ 116.35 పాయింట్లు పెరిగి 23,053 వద్ద ముగింపు

న్యూఢిల్లీ,సామాన్యుడి అస్త్రం

దేశీయ స్టాక్ మార్కెట్లు వరుసగా రెండో రోజూ లాభాల్లో ముగిశాయి. శుక్రవారం ఐటీ, ఫార్మా రంగాల షేర్లలో కొనుగోళ్లు సూచీలకు అండగా నిలిచాయి.



02

గూగుల్‌కు గట్టి ఎదురుదెబ్బ

- ఏఐపై భారీ ఖర్చుల కారణంగా కుప్పకూలిన ఆల్ఫాబెట్ షేర్లు
- ఒక్కరోజే దాదాపు 500 బిలియన్ డాలర్ల మార్కెట్ విలువ నష్టం



హైస్పీడ్ రైళ్ల పనులు వేగవంతం చేయండి

రీజినల్ రింగ్ రైలుతో భారీగా ఉపాధి అవకాశాలు వస్తాయని వెల్లడి

- కేంద్ర మంత్రి అశ్వినీ వైష్ణవ్‌కు సీఎం రేవంత్ విజ్ఞప్తి
- త్వరగా అలైన్‌మెంట్ ప్రక్రియ పూర్తి చేయాలి
- నూతన రైలు మార్గాలను ఆమోదించండి
- అనంతారంలో ఫ్లైట్ మెయింటెనెన్స్ డిపో ఏర్పాటు చేయాలి

02

హైదరాబాద్, సామాన్యుడి అస్త్రం

తెలంగాణకు ప్రకటించిన హైస్పీడ్ రైళ్ల పనులు వేగవంతం చేయాలని రైల్వే శాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్‌కు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విజ్ఞప్తి చేశారు. హైదరాబాద్ – పుణె, హైదరాబాద్ బెంగళూరు, హైదరాబాద్–చెన్నై కారిడార్లకు సంబంధించి, కేంద్ర ప్రభుత్వం పంపిన ప్రతిపాదనలపై రాష్ట్ర ప్రభుత్వం సమీక్షించి, కొన్ని మార్పులను సూచిస్తూ తిరిగి ప్రతిపాదనలు పంపిందని సీఎం తెలిపారుఈ మూడు కారిడార్లకు సంబంధించి రాష్ట్ర ప్రభుత్వం ఎటువంటి భూ సేకరణ ప్రక్రియను ప్రారంభించలేదని కేంద్ర మంత్రి అశ్వినీ వైష్ణవ్‌కు ఆయన వివరించారు.కేంద్ర ప్రభుత్వం అలైన్‌మెంట్ ఆమోదించిన తర్వాత భూ సేకరణను ప్రారంభిస్తామని సీఎం స్పష్టం చేశారు.

బియ్యం ధరలు అడ్డగోలుగా పెంచితే ఉపేక్షించేది లేదు

- కృత్రిమ కొరత సృష్టిస్తే కఠిన చర్యలు
- వ్యాపారులు, రైస్‌మిల్లర్లను రాష్ట్ర పౌరసరఫరాలశాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి
- బీపీటీ బియ్యం కిలోకు రూ.66కు మించొద్దు: ఉత్తమ్



హైదరాబాద్, అక్టోబరు 30 సామాన్యుడి అస్త్రం

అక్రమ నిల్వలు చేసి, కృత్రిమ కొరత సృష్టించి.. బియ్యం ధరలు అడ్డగోలుగా పెంచితే ఉపేక్షించేది లేదని వ్యాపారులు, రైస్‌మిల్లర్లను రాష్ట్ర పౌరసరఫరాలశాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి హెచ్చరించారు. ప్రజలు ఎక్కువగా వినియోగించే బీపీటీ బియ్యం ధర కిలోకు రూ.66కు మించకుండా చర్యలు తీసుకోవాలని, ధరలు స్థిరపడే వరకు దాడులు కొనసాగించాలని అధికారులను ఆదేశించారు. హైదరాబాద్‌లోని కుందన్‌బాగ్ క్యాంపు కార్యాలయంలో పౌరసరఫరాలశాఖ అధికారులతో శుక్రవారం ఆయన సమీక్ష నిర్వహించారు.ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. పెరుగుతున్న బియ్యం ధరలను అదుపులోకి తేవటానికి రాష్ట్రవ్యాప్తంగా ముమ్మరంగా తనిఖీలు నిర్వహిస్తున్నామని, ఇప్పటివరకు 12 కేసులు నమోదు చేశామని తెలిపారు. రాష్ట్రంలో బియ్యం నిల్వలు సమృద్ధిగా ఉన్నాయన్నారు. కొరత వస్తుందనే ఆందోళనతో అవసరానికి మించి కొనుగోలుచేసి నిల్వ చేసుకోవద్దని ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

ప్రభుత్వాన్ని కూల్చే వరకు యాత్ర ఆగదు

- పనిలేక తిరుగుతున్నానా? .. రేవంత్ సర్కార్‌ను కూల్చేదాకా ఆగను: ఈటల రాజేందర్

02



హైదరాబాద్,సామాన్యుడి అస్త్రం

జవహర్‌నగర్ డంపింగ్ యార్డ్‌ను తరలించాలనే డిమాండ్‌తో బీజేపీ ఎంపీ ఈటల రాజేందర్ చేపట్టిన పాదయాత్ర ఉద్రిక్తంగా సాగుతోంది. ఈ క్రమంలో ఆయన రేవంత్ రెడ్డి ప్రభుత్వంపై తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. కేవలం డంపింగ్ యార్డ్ తరలించేంతవరకే కాదు, కాంగ్రెస్ ప్రభుత్వాన్ని కూల్చే వరకు తన యాత్ర ఆగదని ఆయన హెచ్చరించారు.పనిలేక తిరుగుతున్నానంటూ కాంగ్రెస్ నేతలు చేస్తున్న విమర్శలపై ఈటల ఘాటుగా స్పందించారు. “డంపింగ్ యార్డ్ తొలగింపు కోసం నేను పాదయాత్ర చేస్తుంటే, ఈటల రాజేందర్‌కు పనిలేక తిరుగుతున్నాడని కాంగ్రెస్ నేతలు అంటున్నారు.

నవంబర్ 30న ఏపీ, తెలంగాణ ఓటర్ల తుది జాబితా

- రెండు రాష్ట్రాల్లోనూ నవంబర్ 30న ఓటర్ల తుది జాబితా వెల్లడి
- సీఈవోల విజ్ఞప్తి మేరకు షెడ్యూల్‌ను మార్చిన కేంద్ర ఎన్నికల సంఘం

02

హైదరాబాద్,సామాన్యుడి అస్త్రం

రెండు తెలుగు రాష్ట్రాలైన ఆంధ్రప్రదేశ్, తెలంగాణలో ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ కార్యక్రమ షెడ్యూల్‌ను కేంద్ర ఎన్నికల సంఘం (ఈసీఐ) మరోసారి మార్పు చేసింది. రెండు రాష్ట్రాల ప్రధాన ఎన్నికల అధికారుల (సీఈవోలు) విజ్ఞప్తి మేరకు ఈ నిర్ణయం తీసుకుంది. తాజా మార్పులతో రెండు రాష్ట్రాల్లోనూ ఓటర్ల తుది జాబితా నవంబర్ 30వ తేదీన ప్రచురితం కానుంది.ఈ మేరకు ఎన్నికల సంఘం రెండు రాష్ట్రాల సీఈవోలకు వేర్వేరుగా సమాచారం అందించింది.



తుపాను బాధితుల కష్టం తెలుసు.. ప్రతి ఒక్కరినీ ఆదుకుంటాం

- పశ్చిమగోదావరి జిల్లాలో సీఎం చంద్రబాబు రెండో రోజు పర్యటన
- తుపాను బాధితులను ఆదుకుంటామని, పంటల బీమాతో ధీమా కల్పిస్తామని హామీ

02



అమరావతి, అక్టోబర్30సామాన్యుడి అస్త్రం

'అర్నబ్' తుపాను సృష్టించిన బీభత్సం వల్ల నష్టపోయిన ప్రతి ఒక్కరినీ ప్రభుత్వం అన్ని విధాలా ఆదుకుంటుందని, బాధితులకు పూర్తి న్యాయం చేస్తామని ముఖ్యమంత్రి చంద్రబాబు భరోసా ఇచ్చారు. నీట మునిగిన పంటలతో కన్నీరు పెడుతున్న రైతులు, తీవ్ర నష్టాలను ఎదుర్కొన్న కొబ్బరి రైతులు, జీవనోపాధి కోల్పోయిన మత్స్యకారులకు ప్రభుత్వం అండగా నిలుస్తుందని స్పష్టం చేశారు. తుపాను ప్రభావిత ప్రాంతాల్లో సహాయ, పునరావాస కార్యక్రమాలను యుద్ధప్రాతిపదికన చేపట్టి, వీలైనంత త్వరగా సాధారణ పరిస్థితులు నెలకొల్పాలని అధికారులను ఆదేశించారు. క్షేత్రస్థాయిలో నష్టాన్ని అంచనా వేసి, బాధితుల కష్టాలను స్వయంగా తెలుసుకునేందుకు చేపట్టిన పర్యటనలో భాగంగా, రెండో రోజైన శుక్రవారం ఆయన పశ్చిమగోదావరి జిల్లాలోని మొగల్తూరు, నరసాపురం మండలాల్లో విస్తృతంగా పర్యటించారు.

పంటల బీమాతోనే రైతుకు ధీమా

నరసాపురం మండలం కొత్త నవరసపురంలో నీట మునిగిన వరి పంట పొలాలను ముఖ్యమంత్రి పరిశీలించారు. అక్కడి రైతులతో నేరుగా మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. పంట నష్టంపై ఆందోళన చెందవద్దని, ప్రభుత్వం నష్టాన్ని అంచనా వేసి ఆదుకుంటుందని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రతి రైతు తప్పనిసరిగా పంటల బీమా చేయించుకోవాలని సూచించారు.


ఉద్యోగానికే రిటైర్మెంట్, సమాజ సేవకు కాదు

ఎమ్మెల్సీ ప్రొఫెసర్ కోదండరాం

హైదరాబాద్,సామాన్యుడి అస్త్రం

ప్రభుత్వ ఉద్యోగులకు పదవీ విరమణ అనేది కేవలం ఉద్యోగానికి మాత్రమే పరిమితమని, సమాజ సేవకు ఎలాంటి విరమణ ఉండదని ఎమ్మెల్సీ ప్రొఫెసర్ కోదండరాం స్పష్టం చేశారు. కొందరు ఉద్యోగులు కేవలం తమ విధులకు మాత్రమే పరిమితమవుతారని, అలాంటి వారికి పదవీ విరమణ వర్తించవచ్చని అన్నారు.

02



విశాఖ పోర్టులో అగ్నిప్రమాదం

నిర్మాణంలో ఉన్న కన్వేయర్ బెల్ట్‌కు అంటుకున్న మంటలు

అమరావతి,సామాన్యుడి అస్త్రం

విశాఖ పోర్టు ట్రస్ట్ పరిధిలో ఈ మధ్యాహ్నం భారీ అగ్నిప్రమాదం సంభవించింది. సీ హార్స్ జంక్షన్ సమీపంలో ఉన్న జేఎం భక్షి కంపెనీ ప్రాంగణంలో నిర్మాణంలో ఉన్న ఓ కన్వేయర్ బెల్ట్‌కు మంటలు అంటుకున్నాయి. ఈ ఘటనతో పోర్టు సిబ్బంది, స్థానికులు తీవ్ర భయాందోళనకు గురయ్యారు.

02



హైస్పీడ్ రైళ్ల పనులు వేగవంతం చేయండి

మొదటి పేజి తరువాయి

వికారాబాద్ – కృష్ణా కొత్త రైలు మార్గాన్ని (130 కి.మీ.) వెంటనే మంజూరు చేయాలని కేంద్ర మంత్రిని సీఎం కోరారు. వికారాబాద్ జిల్లా టేకల్కోడ్ పరిసరాల్లో భారీ సున్నపురాయి నిక్షేపాలు బయటపడ్డాయని.. దీంతో ఈ ప్రాంతాన్ని సిమెంట్, టెక్స్‌టైల్ హబ్‌గా మార్చేందుకు ప్రభుత్వం ప్రణాళికలు సిద్ధం చేసిందని తెలియజేశారు.హైదరాబాద్ చుట్టూ సుమారు 360 కి.మీ. మేర నిర్మిస్తున్న రీజినల్ రింగ్ రోడ్డు (ఆర్ఆర్ఆర్) పక్కనే రీజినల్ రింగ్ రైలును అలైన్‌మెంట్ చేయాలని కేంద్ర మంత్రి అశ్వినీ వైష్ణవ్‌కు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి విజ్ఞప్తి చేశారు. రీజినల్ రింగ్ రైలుతో పెద్ద ఎత్తున ఉపాధి అవకాశాలు లభిస్తాయన్నారు. డోర్నకల్–గద్వాల్, కల్వకుర్తి – మాచర్ల, కాచిగూడ –జగ్గయ్యపేట (250 కి.మీ.), పటాన్‌చెరు –ఆదిలాబాద్ (320 కి.మీ.), బోధన్ – లాతూర్ (175 కి.మీ.), అక్కన్నపేట బైపాస్ లైన్ (8 కి.మీ.) మార్గాలను వెంటనే మంజూరు చేయాలని రైల్వే శాఖ మంత్రిని ఆయన కోరారు

అనంతారంలో ఫ్రైట్ మెయింటెనెన్స్ డిపో

దక్షిణ మధ్య రైల్వే ప్రతిష్టాత్మకంగా చేపట్టదలచిన మెగా కోచింగ్, ఫ్రైట్ మెయింటెనెన్స్ డిపోను మహబూబాబాద్ సమీపంలోని అనంతారం గ్రామంలో ఏర్పాటు చేయాలని సీఎం అన్నారు. ఈ డిపో ఏర్పాటుకు అవసరమైన 409 ఎకరాల 1 గుంట భూమిని రైల్వే శాఖకు అప్పగించేందుకు ఇప్పటికే అంగీకరించిన విషయాన్ని కేంద్ర మంత్రి దృష్టికి తీసుకెళ్లారు.ఫ్రైట్ మెయింటెనెన్స్ డిపోకు త్వరగా అనుమతులు మంజూరు చేయాలని ఆయన కోరారు. ఈ సమావేశంలో రాష్ట్ర మంత్రి వివేక్ వెంకటస్వామి, ఎంపీలు మల్లు రవి, వేం నరేందర్ రెడ్డి, చామల కిరణ్ కుమార్ రెడ్డి, బలరాం నాయక్, గడ్డం వంశీకృష్ణ, అనిల్ కుమార్ యాదవ్, రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కే రామకృష్ణారావు, హెచ్ఎండీఏ కమిషనర్ సర్ఫరాజ్ అహ్మద్, తెలంగాణ భవన్ రెసిడెంట్ కమిషనర్ అద్వైత్ కుమార్ సింగ్ పాల్గొన్నారు.

తుపాను బాధితుల కష్టం తెలుసు.. ప్రతి ఒక్కరినీ ఆదుకుంటాం

మొదటి పేజి తరువాయి

పంటల బీమాతోనే రైతుకు ధీమా

నరసాపురం మండలం కొత్త నవరసపురంలో నీట మునిగిన వరి పంట పొలాలను ముఖ్యమంత్రి పరిశీలించారు. అక్కడి రైతులతో నేరుగా మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. పంట నష్టంపై ఆందోళన చెందవద్దని, ప్రభుత్వం నష్టాన్ని అంచనా వేసి ఆదుకుంటుందని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రతి రైతు తప్పనిసరిగా పంటల బీమా చేయించుకోవాలని సూచించారు. "ప్రకృతి వైపరీత్యాలు మన చేతుల్లో లేవు. కానీ, నష్టం జరిగినప్పుడు బీమా ఉంటే రైతుకు ఆర్థికంగా భరోసా ఉంటుంది. ఇ-పంట విధానం ద్వారా రాష్ట్రంలోని ప్రతి ఎకరాకు బీమా సౌకర్యం కల్పించేందుకు చర్యలు తీసుకుంటున్నాం. ప్రభుత్వం అందించే ఇన్‌పుట్ సబ్సిడీకి అదనంగా బీమా పరిహారం రైతుకు అండగా నిలుస్తుంది" అని వివరించారు. పంట కాలువల్లో పూడిక కారణంగా నీటి ప్రవాహం సరిగా లేక పంటలు ముంపునకు గురవుతున్నాయని రైతులు సీఎం దృష్టికి తీసుకురాగా, ఆయన తక్షణమే స్పందించారు. గోదావరి డెల్టా కాలువల ఆధునీకరణకు రూ.3 వేల కోట్లు కేటాయించామని, త్వరలోనే పనులు ప్రారంభించి ముంపు సమస్యకు శాశ్వత పరిష్కారం చూపుతామని హామీ ఇచ్చారు. రైతులు ప్రకృతి సేద్యం వైపు దృష్టి సారిస్తే, పంటలకు మంచి డిమాండ్ వస్తుందని, ఆదాయం కూడా పెరుగుతుందని సూచించారు.

నేలకొరిగిన 15 వేల విద్యుత్ స్తంభాలు

తుపాను ప్రభావంతో రాష్ట్రవ్యాప్తంగా 15 వేలకు పైగా విద్యుత్ స్తంభాలు నేలకూలాయని, ఇది విద్యుత్ సరఫరాకు పెను సవాలుగా మారిందని సీఎం తెలిపారు. "రేపు సాయంత్రానికల్లా రాష్ట్రవ్యాప్తంగా విద్యుత్ సరఫరాను పూర్తిస్థాయిలో పునరుద్ధరిస్తాం. తాగునీరు గృహ అవసరాలకు, ఆ తర్వాత వ్యవసాయానికి విద్యుత్ అందిస్తాం" అని ప్రకటించారు. అవసరమైతే తెలంగాణ నుంచి కూడా అదనపు సిబ్బందిని రప్పించి పనులు వేగవంతం చేస్తున్నట్లు వెల్లడించారు. పునరుద్ధరణ పనులను స్వయంగా పరిశీలించిన ఆయన, కార్మికులతో కలిసి విద్యుత్ స్తంభాన్ని నిలబెట్టేందుకు సహకరించి వారిలో స్ఫూర్తి నింపారు. విపత్కర పరిస్థితుల్లోనూ ప్రాణాలకు తెగించి పనిచేస్తున్న విద్యుత్ సిబ్బందిని, కార్మికులను ముఖ్యమంత్రి అభినందించారు. ఒక్క పశ్చిమగోదావరి జిల్లాలోనే 12,500 చెట్లు కూలిపోయాయని, వాటిని తొలగించి రవాణా వ్యవస్థను పునరుద్ధరిస్తున్నామని చెప్పారు. ప్రైవేట్ టెలికాం టవర్లకు విద్యుత్ సరఫరా నిలిచిపోవడంతో కమ్యూనికేషన్ వ్యవస్థకు అంతరాయం ఏర్పడిందని, వాటిని కూడా త్వరగా పునరుద్ధరిస్తామని తెలిపారు.

షెల్టర్లలో బాధితులకు భరోసా.. మత్స్యకారులకు హామీ

అనంతరం మొగల్తూరు మండలం మాట్రేవు గ్రామంలోని తుపాను పునరావాస కేంద్రాన్ని (షెల్టర్) ముఖ్యమంత్రి సందర్శించారు. గత నాలుగు రోజులుగా అక్కడే ఆశ్రయం పొందుతున్న మహిళలు, వృద్ధులు, చిన్నారులతో మాట్లాడారు. తుపాను తీరం దాటే సమయంలో ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని గడిపామని, తీవ్ర భయాందోళనకు గురయ్యామని బాధితులు సీఎంకు వివరించారు. దీనిపై స్పందించిన చంద్రబాబు, "ప్రభుత్వం ముందుగానే హెచ్చరికలు జారీ చేసి, ముంపు ప్రాంతాల ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించడం వల్లే ప్రాణనష్టాన్ని గణనీయంగా తగ్గించగలిగాం. మీ ప్రాణాలకు మాది భరోసా" అని ధైర్యం చెప్పారు. ఈ సందర్భంగా వశిష్ట గోదావరి ముఖద్వారం వద్ద పూడిక సమస్య తీవ్రంగా ఉందని, దీనివల్ల వేటకు వెళ్లడం కష్టంగా మారిందని మత్స్యకారులు సీఎం దృష్టికి తెచ్చారు.

నవంబర్ 30న ఏపీ, తెలంగాణ ఓటర్ల తుది జాబితా

మొదటి పేజి తరువాయి

సీఈవోల విజ్ఞప్తి మేరకు షెడ్యూల్‌ను మార్చిన కేంద్ర ఎన్నికల సంఘం

తెలంగాణలో నవంబర్ 26, ఏపీలో నవంబర్ 20 వరకు పొడిగించిన అభ్యంతరాల గడువు

తెలంగాణలో 2.59 కోట్లు, ఏపీలో 42.55 లక్షల ఓటర్ల పేర్లకు తుది జాబితాలో చోటు

వాస్తవానికి పాత షెడ్యూల్ ప్రకారం తెలంగాణలో నవంబర్ 9న, ఆంధ్రప్రదేశ్‌లో అక్టోబర్ 30నే తుది జాబితా విడుదల కావాల్సి ఉంది. అయితే, క్షేత్రస్థాయిలో ప్రక్రియ ఇంకా పూర్తి కాకపోవడంతో సీఈవోల అభ్యర్థన మేరకు ఈసీ గడువును పొడిగించింది.సవరించిన షెడ్యూల్ వివరాలను క్షేత్రస్థాయి అధికారులందరికీ తెలియజేయాలని, మీడియా ద్వారా ప్రజలకు విస్తృత ప్రచారం కల్పించాలని ఈసీ తమ ఆదేశాల్లో స్పష్టం చేసింది. అదేవిధంగా మార్పు చేసిన షెడ్యూల్ గురించి రాజకీయ పార్టీలకు కూడా రాతపూర్వకంగా సమాచారం అందించాలని సూచించింది.

గణాంకాల వివరాలు

ప్రత్యేక సవరణ ప్రక్రియ ప్రారంభానికి ముందు తెలంగాణలో 3,38,26,448 మంది ఓటర్లు ఉండగా, వారిలో 2,64,87,213 మంది మాత్రమే తమ వివరాలను నమోదు చేసుకున్నారు. మిగిలిన 73,39,235 మంది ఓటర్లను వలస వెళ్లినవారు, మరణించినవారు, చిరునామా మారినవారు, నకిలీ ఓట్ల (ఘోస్ట్) కేటగిరీ కింద గుర్తించి డ్రాఫ్ట్ జాబితా నుంచి తొలగించారు.అక్టోబర్ 29 నాటికి అందిన సమాచారం ప్రకారం.. తెలంగాణలో జారీ చేసిన 92,88,188 నోటీసులకు గానూ 92,81,189 నోటీసులు ఓటర్లకు అందజేశారు. వీటిలో 92,08,443 నోటీసులపై విచారణ పూర్తయింది. ఇప్పటివరకు మొత్తం 2,59,22,684 మంది ఓటర్ల పేర్లను తుది జాబితాలో చేర్చడానికి అధికారులు ఆమోదం తెలిపారు. వీరిలో 59,31,395 మంది ఓటర్ల విషయంలో ఉన్న సాంకేతిక సమస్యలను పరిష్కరించారు. మరో 30,64,168



మందిని 2002 నాటి జాబితా నుంచి మ్యాపింగ్ చేశారు. విచారణ అనంతరం 50,690 మంది ఓటర్లు జాబితాలో చేరడానికి అర్హులు కారని అధికారులు తేల్చారు.ఇక, ఆంధ్రప్రదేశ్ విషయానికొస్తే.. ఓటర్ల జాబితా సవరణకు సంబంధించి 44,28,858 నోటీసులపై విచారణ పూర్తయింది. వీరిలో 42,55,630 మంది ఓటర్ల పేర్లను తుది జాబితాలో చేర్చడానికి ఆమోదం లభించింది. పరిశీలన తర్వాత 1,73,662 మంది ఓటర్లు జాబితాలో చోటు దక్కించుకోవడానికి అర్హులు కారని అధికారులు నిర్ధారించారు.

ప్రభుత్వాన్ని కూల్చే వరకు యాత్ర ఆగదు

మొదటి పేజి తరువాయి

జవహర్‌నగర్ డంపింగ్ యార్డ్ తరలింపు కోసం ఈటల పాదయాత్ర

నిధులు తేలేకపోతే రాజకీయాల నుంచి తప్పుకుంటానని సవాల్

డీటెయిల్డ్ ప్రాజెక్ట్ రిపోర్ట్ సిద్ధం చేయాలని డిమాండ్

డంపింగ్ యార్డ్ వల్ల ప్రజల ఆరోగ్యం దెబ్బతింటోందని ఆవేదన

కేవలం డంపింగ్ యార్డ్ తరలించేదాకా మాత్రమే కాదు.. మీ ప్రభుత్వం కూలిపోయే వరకు నేను తిరుగుతూనే ఉంటా" అని ఆయన స్పష్టం చేశారు.జవహర్‌నగర్ డంపింగ్ యార్డ్ రీసైక్లింగ్ కోసం అయ్యే ఖర్చుపై రాష్ట్ర ప్రభుత్వం వెంటనే డీటెయిల్డ్ ప్రాజెక్ట్ రిపోర్ట్ (డీపీఆర్) సిద్ధం చేయాలని ఈటల డిమాండ్ చేశారు. నివేదిక ఇస్తే, ప్రధానమంత్రి మోదీని ఒప్పించి అవసరమైన నిధులను తానే తీసుకొస్తానని ప్రకటించారు. ఒకవేళ తాను నిధులు తీసుకురావడంలో విఫలమైతే, రాజకీయాల నుంచి శాశ్వతంగా తప్పుకుంటానని సవాల్ విసిరారు.అక్టోబర్ 27న ఏదులాబాద్‌లోని శ్రీరంగనాథ స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు చేసి ఈటల తన పాదయాత్రను ప్రారంభించారు. డంపింగ్ యార్డ్ కాలుష్యం వల్ల పరిసర గ్రామాలు, కాలనీల్లోని ప్రజల ఆరోగ్యం తీవ్రంగా దెబ్బతింటోందని, గాలి, భూగర్భ జలాలు కలుషితమవుతున్నాయని, తక్షణమే దాన్ని తరలించాలని ఆయన డిమాండ్ చేస్తున్నారు.

గూగుల్‌కు గట్టి ఎదురుదెబ్బ.. ఒక్కరోజే రూ.47లక్షల కోట్లు నష్టం..

మొదటి పేజి తరువాయి

టెక్ దిగ్గజం, గూగుల్ మాతృ సంస్థ అయిన 'ఆల్ఫాబెట్' మార్కెట్ విలువలో చారిత్రక నష్టాన్ని చవిచూసింది. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) టెక్నాలజీపై భారీగా ఖర్చు చేయడం, ప్రధాన ఆదాయ వనరైన సెర్చ్ అడ్వర్టైజింగ్ వృద్ధి మందగించడం వంటి కారణాలతో ఇన్వెస్టర్లు ఆందోళనకు గురయ్యారు. ఫలితంగా గురువారం ట్రేడింగ్‌లో కంపెనీ షేర్లు భారీగా పతనమయ్యాయి. ఒక్కరోజే ఆల్ఫాబెట్ మార్కెట్ విలువ నుంచి దాదాపు 500 బిలియన్ డాలర్లు (రూ.47లక్షల కోట్లు) ఆవిరైపోయాయి. స్టాక్ మార్కెట్ చరిత్రలో ఒకే రోజు ఒక కంపెనీ ఇంత పెద్ద మొత్తంలో విలువను కోల్పోవడం ఇది ఒక రికార్డు.మూడో త్రైమాసిక ఆర్థిక ఫలితాల వెల్లడి తర్వాత ఆల్ఫాబెట్ క్లాస్-ఏ షేర్లు 12.64% పతనమై 283.82 డాలర్ల వద్ద ముగిశాయి. ఈ పతనంతో కంపెనీ మార్కెట్ క్యాపిటలైజేషన్ సుమారు 499.8 బిలియన్ డాలర్లు తగ్గింది. కంపెనీ తన మూడో త్రైమాసికంలో 127.6 బిలియన్ డాలర్ల ఆదాయాన్ని ప్రకటించింది. ఇది గతేడాదితో పోలిస్తే 25% అధికమే అయినప్పటికీ, మార్కెట్ విశ్లేషకుల అంచనాలను అందుకోలేకపోయింది.

ఉద్యోగానికే రిటైర్మెంట్, సమాజ సేవకు కాదు: కోదండరాం

మొదటి పేజి తరువాయి



జడ్చర్లలో నిర్వహించిన ఎంఈఓ మంజులాదేవి పదవీ విరమణ సన్మాన సభలో కోదండరాం పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ వ్యాఖ్యలు చేశారు. మంజులాదేవి వంటి వారికి పదవీ విరమణ ఉండదని ఆయన అన్నారు. ఈ కార్యక్రమానికి ఎంపీ డీకే అరుణ, ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి, ఎమ్మెల్సీ కేపీఎన్ రెడ్డి, మాజీ మంత్రి డాక్టర్ లక్ష్మారెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు ఎ. శేఖర్, ప్రతాప్ రెడ్డి, ఆర్జేడీ సోమిరెడ్డి హాజరయ్యారు. వీరితో పాటు పలువురు అధికారులు, ప్రజాప్రతినిధులు, వివిధ ఉపాధ్యాయ సంఘాల రాష్ట్ర, జిల్లా స్థాయి నాయకులు కూడా పాల్గొని మంజులాదేవికి శుభాకాంక్షలు తెలిపి, సన్మానించారు.

ఉప్పాడ రక్షణ గోడ పనులు వేగవంతం చేయండి..

మొదటి పేజి తరువాయి

దీపావళి తర్వాత తాను స్వయంగా మత్స్యకార గ్రామాల్లో పర్యటించి, వారి సమస్యలను క్షేత్రస్థాయిలో తెలుసుకుంటానని ప్రకటించారు. ఉప్పాడ తీర ప్రాంత రక్షణ గోడ డిజైన్, డీపీఆర్ పనులను వేగవంతం చేసి, నిర్మాణం వెంటనే ప్రారంభించాలని ఆదేశించారు. తుపాను ధాటికి తీవ్రంగా దెబ్బతిన్న ఉప్పాడ–కాకినాడ బీచ్ రోడ్డును తక్షణమే పునరుద్ధరించాలని స్పష్టం చేశారు.ఇళ్లు, పంటలు, పడవలు, వలలకు జరిగిన నష్టాన్ని వేగంగా అంచనా వేసి ప్రభుత్వానికి నివేదిక సమర్పించాలని, తద్వారా బాధితులకు పరిహారం ఆలస్యం కాకుండా అందించాలని పవన్ ఆదేశించారు. వరద బాధితులకు 25 కిలోల బియ్యం, మత్స్యకారులు, చేనేత కార్మికులకు 50 కిలోల బియ్యంతో పాటు నిత్యావసరాలు అందించాలని సూచించారు. సకాలంలో స్పందించి 92 తీరప్రాంత ఆవాసాల నుంచి 10,000 మందికి పైగా ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించడంపై జిల్లా యంత్రాంగాన్ని ఆయన అభినందించారు.

రూ. 26 కోట్ల సైబర్ ఫ్రాడ్ కేసు..

మొదటి పేజి తరువాయి

సైబర్ మోసానికి సంబంధించిన భారీ మనీలాండరింగ్ కేసులో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) హైదరాబాద్‌లో సోదాలు నిర్వహించింది. అల్లంరాజు సత్యనారాయణమూర్తికి చెందిన మూడు ప్రాంగణాల్లో ఈ తనిఖీలు చేపట్టినట్లు అధికారులు వెల్లడించారు. కేరళలోని ఎర్నాకుళం సైబర్ క్రైమ్ పోలీస్ స్టేషన్‌లో నమోదైన ఎఫ్.ఐ.ఆర్ ఆధారంగా ఈడీ ఈ చర్యలు చేపట్టింది.కేసు వివరాల ప్రకారం.. నిమేష్ అనే వ్యక్తిని ఫోన్ కాల్స్, టెలిగ్రామ్ సందేశాల ద్వారా కొందరు గుర్తుతెలియని వ్యక్తులు సంప్రదించి, అధిక లాభాల పేరుతో ప్రలోభపెట్టారు

సింగరేణి కార్మికులకు మరో బోనస్..

మొదటి పేజి తరువాయి

తెలంగాణ ప్రభుత్వం సింగరేణి కార్మికులకు మరో శుభవార్త అందించింది. ఇటీవల దసరా పండుగ సందర్భంగా భారీ బోనస్ అందుకున్న కార్మికులకు, ఇప్పుడు దీపావళి కానుకగా మరో భారీ బోనస్‌ను ప్రకటించింది. దీని కింద ఒక్కో కార్మికుడికి గరిష్ఠంగా రూ. 1,10,250 చొప్పున మొత్తం రూ. 419 కోట్లను చెల్లించనుంది. ఈ నిర్ణయంతో సింగరేణి వ్యాప్తంగా ఉన్న సుమారు 38,000 మంది కార్మికులు లబ్ధి పొందనున్నారు.నెల రోజుల వ్యవధిలోనే సింగరేణి కార్మికులు రెండు భారీ బోనస్‌లు అందుకోనుండటం విశేషం. ఇటీవల దసరా బోనస్‌గా ఒక్కొక్కరికి గరిష్ఠంగా రూ. 1.54 లక్షల వరకు చెల్లించారు. ఇప్పుడు ప్రకటించిన దీపావళి బోనస్‌తో కలిపి, కేవలం రెండు పండుగలకు ఒక్కో కార్మికుడు సగటున/గరిష్ఠంగా రూ. 2.65 లక్షల వరకు ప్రయోజనం పొందనున్నారు. ఈ రెండు బోనస్‌ల కోసం సింగరేణి సంస్థ మొత్తంగా రూ. 1,020 కోట్లకు పైగా వెచ్చిస్తోంది. ఇది కార్మికుల పట్ల యాజమాన్యం నిబద్ధతను తెలియజేస్తోంది.

హైదరాబాద్‌ను ముంచెత్తిన భారీ వర్షం

మొదటి పేజి తరువాయి

శుక్రవారం సాయంత్రం హైదరాబాద్‌లోని పలు ప్రాంతాల్లో ఉరుములు, మెరుపులతో కూడిన భారీ వర్షం కురిసింది. అకస్మాత్తుగా కురిసిన కుండపోత వానతో నగర జీవనం అస్తవ్యస్తంగా మారింది. గంటకు పైగా ఏకధాటిగా వర్షం పడటంతో రోడ్లన్నీ జలమయమయ్యాయి. ట్రైనేజీలు పొంగిపొర్లడంతో పలు లోతట్టు ప్రాంతాలు నీట మునిగాయి.నగరంలోని ఖైరతాబాద్, పంజాగుట్ట, సోమాజిగూడ, అమీర్‌పేట్, ఎస్ఆర్ నగర్, జూబ్లీహిల్స్, బంజారాహిల్స్, ఫిల్మ్ నగర్ వంటి ప్రధాన ప్రాంతాల్లో రోడ్లపైకి భారీగా వరద నీరు చేరింది. దీంతో ఆఫీసుల నుంచి ఇళ్లకు వెళ్లే ఉద్యోగులు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. సాయంత్రం రద్దీ సమయం కావడంతో ట్రాఫిక్ కష్టాలు రెట్టింపయ్యాయి.ముఖ్యంగా ఐటీ కారిడార్‌లో పరిస్థితి తీవ్రంగా మారింది. మాదాపూర్, హైటెక్‌సిటీ, కేపీహెచ్‌బీ, మైండ్‌స్పేస్, ఐకియా మార్గాల్లో వాహనాలు కిలోమీటర్ల మేర బారులు తీరాయి. మాదాపూర్ సిటీ వైన్స్ వద్ద ప్రధాన రహదారి చెరువును తలపించడంతో రాకపోకలు పూర్తిగా స్తంభించాయి. కుత్బుల్లాపూర్ నుంచి సూరారం వరకు, షాపూర్ నుంచి గాజులరామారం వరకు కూడా భారీగా ట్రాఫిక్ జామ్ అయింది. వర్షానికి తడుస్తూ కొందరు ప్రయాణికులు మెట్రో పిల్లర్ల కింద తలదాచుకోగా, మరికొందరు గంటల తరబడి ట్రాఫిక్‌లోనే చిక్కుకుపోయారు.

విశాఖ పోర్టులో అగ్నిప్రమాదం

మొదటి పేజి తరువాయి

వివరాల్లోకి వెళితే, మధ్యాహ్నం సుమారు 1.45 గంటల సమయంలో కన్వేయర్ బెల్ట్‌పై ఒక్కసారిగా మంటలు చెలరేగి వేగంగా వ్యాపించాయి. పెద్ద ఎత్తున అగ్నికీలలు ఎగిసిపడటంతో పాటు, దట్టమైన నల్లటి పొగ ఆ ప్రాంతాన్ని కమ్మేసింది. సమాచారం అందుకున్న వెంటనే విశాఖ పోర్టు ట్రస్ట్ అగ్నిమాపక సిబ్బంది ఫైర్ ఇంజిన్లతో ఘటనా స్థలానికి చేరుకుని మంటలను అదుపులోకి తెచ్చేందుకు ప్రయత్నాలు ప్రారంభించారు.

మియాపూర్‌లో 550 ఎకరాలు ప్రభుత్వానివే..

ఉన్న ఇళ్లపై కలెక్టర్ కీలక హామీ!

■ రూ.50 వేల కోట్ల నుంచి రూ.60 వేల కోట్ల విలువ ఉంటుందని అంచనా.. ఖాళీ భూముల రక్షణకు రెవెన్యూ చర్యల ■ సర్వే నంబర్లు 100, 101లో ప్రభుత్వ యాజమాన్యాన్ని సమర్థించిన సుప్రీంకోర్టు ■సుమారు 400 ఎకరాల ఖాళీ స్థలానికి హద్దులు గుర్తించి పూర్తిస్థాయి కంచె■ ఇప్పటికే ఉన్న ఇళ్లు ప్రస్తుతానికి తొలగించబోమని కలెక్టర్ భరోసా

సామాన్యుడి అస్త్రం / సైబరాబాద్ బ్యూరో :

ఒకవైపు వేల కోట్ల రూపాయల విలువైన ప్రభుత్వ భూమి.. మరోవైపు అక్కడ ఇప్పటికే ఇళ్లు నిర్మించుకుని ఉంటున్న కుటుంబాలు. మియాపూర్ భూములపై సుప్రీంకోర్టు తీర్పు నేపథ్యంలో ఈ రెండు అంశాలపై రంగారెడ్డి జిల్లా కలెక్టర్ స్పష్టత ఇచ్చారు. సర్వే నంబర్లు 100, 101 పరిధిలోని 550 ఎకరాల 39 గుంటల భూమి ప్రభుత్వానిదేనని, దాన్ని కాపాడేందుకు చర్యలు చేపడుతున్నామని తెలిపారు. అదే సమయంలో అక్కడ సామాన్యులు నిర్మించుకున్న ఇళ్లు, ఇతర నిర్మాణాలను ప్రస్తుతానికి తొలగించబోమని భరోసా ఇచ్చారు. ఖాళీ భూమికి హద్దులు నిర్ధారించి రక్షణ కల్పించడంపై యంత్రాంగం దృష్టిపెట్టినట్లు వివరించారు.దశాబ్దాలుగా న్యాయస్థానాల్లో కొనసాగిన మియాపూర్ భూ వివాదంలో సుప్రీంకోర్టు అక్టోబర్ 29న కీలక తీర్పు వెలువరించింది. ప్రైవేటు వ్యక్తుల అప్పీళ్లను కొట్టివేస్తూ, వివాదాస్పద భూములపై ప్రభుత్వ యాజమాన్యాన్ని సమర్థించింది. ఈ భూములు ప్రభుత్వానికే చెందుతాయన్న అప్పటి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ హైకోర్టు నిర్ణయాన్ని జస్టిస్ ఎం.ఎం.సుందరేశ్, జస్టిస్ సతీశ్ చంద్రశర్మ ధర్మాసనం నిలబెట్టింది.



కోర్టు తీర్పు తర్వాత.. క్షేత్రస్థాయిలో చర్యలు

తీర్పు నేపథ్యంలో అధికారులతో కలిసి భూములను పరిశీలించిన కలెక్టర్.. తదుపరి రక్షణ చర్యలపై రెవెన్యూ యంత్రాంగానికి సూచనలు చేశారు. మొత్తం విస్తీర్ణంలో సుమారు 400 ఎకరాలు ఖాళీగా ఉన్నాయని తెలిపారు. ఈ భూమి హెచ్ఎండీఏ పర్యవేక్షణలో ఉందని, గతంలోనే సుప్రీంకోర్టు అనుమతితో రక్షణ కంచె ఏర్పాటు చేసినట్లు వివరించారు.మిగిలిన ఖాళీ ప్రాంతాల్లోనూ హద్దులను పక్కాగా గుర్తించి పూర్తిస్థాయిలో ఫెన్సింగ్ చేపట్టాలని ఆదేశించినట్లు చెప్పారు. కలెక్టర్ వెల్లడించిన వివరాల ప్రకారం.. ప్రస్తుతం ఖాళీగా ఉన్న భూమిని స్వాధీనంలోకి తీసుకుని, దానికి రక్షణ కల్పించే ప్రక్రియ కొనసాగుతోంది.


ఇళ్లున్న కుటుంబాలకు ప్రస్తుతానికి ఊరట

ప్రభుత్వ భూమిగా తేలిన తర్వాత అక్కడి నివాసాల పరిస్థితి ఏమిటన్నది స్థానికులకు అత్యంత కీలకమైన అంశం. భూమి విలువ ఎంతన్న చర్చ కంటే.. తమ ఇల్లు ఉంటుందా, తొలగిస్తారా అన్న ప్రశ్నే నివాసితులకు దగ్గరగా ఉంటుంది. ఈ నేపథ్యంలో కలెక్టర్ ఇచ్చిన హామీ ప్రాధాన్యం సంతరించుకుంది.ఇప్పటికే సామాన్యులు నిర్మించుకున్న ఇళ్లు, ఇతర నిర్మాణాలను ప్రస్తుతానికి తొలగించబోమని ఆయన స్పష్టం చేశారు. నివాసితులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. అయితే ఈ ప్రకటనలో ప్రధానంగా చెప్పింది ప్రస్తుతం నిర్మాణాలను తొలగించబోమన్న విషయమే. ఇళ్ల క్రమబద్ధీకరణ, వ్యక్తిగత స్థలాల హక్కులు లేదా భవిష్యత్తులో అనుసరించే విధానంపై ఈ ప్రెస్‌మీట్ పాయింట్లలో వివరాలు వెల్లడించలేదు.

1912 రికార్డుల నుంచి సాగిన భూమి చరిత్ర

మియాపూర్ భూముల వివాదాన్ని అర్థం చేసుకోవాలంటే వందేళ్లకు పైగా వెనక్కి వెళ్లాల్సి ఉంటుంది. కలెక్టర్ వివరించిన ప్రకారం.. నిజాం కాలంలో సైన్యం నిర్వహణకు సంబంధించిన జాగీర్ వ్యవస్థలో ఈ భూములు ఉండేవి. అయితే 1912 నాటి సర్వే రికార్డుల్లోనే వీటిని 'సర్కారీ పోరంబోకు'గా నమోదు చేశారు.సుప్రీంకోర్టు కూడా ఈ పాత రికార్డులను పరిశీలించింది. జాగీర్ ద్వారా లభించిన హక్కులు భూమిపై సంపూర్ణ యాజమాన్యాన్ని కల్పించవని వివరించింది. 1949లో జాగీర్దారీ వ్యవస్థ రద్దు తర్వాత సంబంధిత జాగీర్ హక్కులు అంతరించాయని పేర్కొంది. అంటే.. జాగీర్‌తో సంబంధం ఉందని చెప్పడం ఒక్కటే భూమిపై ప్రైవేటు యాజమాన్యాన్ని నిరూపించడానికి సరిపోదన్నది తీర్పులో కీలకాంశం.

ప్రభుత్వ భూమిలో ప్రైవేటు పేర్లు ఎలా వచ్చాయి?



భూమి ప్రభుత్వానిదని పాత రికార్డులు చెబుతున్నప్పుడు.. ఆ తర్వాత రెవెన్యూ రికార్డుల్లో ప్రైవేటు వ్యక్తుల పేర్లు ఎలా చేరాయన్నది ఈ వ్యవహారంలో మరో ముఖ్యమైన ప్రశ్న. కొందరు బోగస్ పత్రాలతో ప్రభుత్వాన్ని పక్కదోవ పట్టించే ప్రయత్నం చేశారని కలెక్టర్ పేర్కొన్నారు. నకిలీ ఎంట్రీలు సృష్టించి, రికార్డులను తారుమారు చేసిన అప్పటి అధికారులపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు.దీంతో భూమికి కంచె వేయడంతోపాటు రికార్డుల్లో అక్రమాలు ఎలా జరిగాయన్న అంశంపైనా అధికార యంత్రాంగం దృష్టిపెట్టాల్సి ఉంది. ఏ రికార్డులో, ఎవరి ఆదేశాలతో, ఏ ఆధారంపై పేర్లు నమోదయ్యాయన్న వివరాలు బయటకు వస్తేనే బాధ్యత ఎవరిదన్నది స్పష్టమవుతుంది. కలెక్టర్ ప్రకటించిన చర్యల్లో ఈ పరిశీలన కీలకం కానుంది.

వేల కోట్ల విలువ.. ప్రజా సంపదగా పరిరక్షణ

ఈ భూమి విలువ దాదాపు రూ.50 వేల కోట్ల నుంచి రూ.60 వేల కోట్ల వరకు ఉంటుందని కలెక్టర్ అంచనా వేశారు. ఇది ప్రజలకు చెందిన సంపద అని, ప్రభుత్వ భూమిని కాపాడి తీరుతామని స్పష్టం చేశారు. ఈ విలువ కలెక్టర్ వెల్లడించిన అంచనా కాగా.. సుప్రీంకోర్టు తీర్పులో ప్రధానంగా తేల్చింది భూమి యాజమాన్యానికి సంబంధించిన వివాదాన్ని.ఇప్పుడు అధికారుల ముందున్న పని.. ఖాళీ భూమిని క్షేత్రస్థాయిలో స్పష్టంగా గుర్తించడం, హద్దులు నిర్ధారించడం, కంచెతో రక్షణ కల్పించడం. అదే సమయంలో ఇప్పటికే నివసిస్తున్న కుటుంబాలకు వారి నిర్మాణాల విషయంలో అధికారిక సమాచారం అందించడం కూడా అవసరం. ప్రభుత్వ భూమి పరిరక్షణ చర్యలు ఎక్కడ జరుగుతున్నాయి, నివాసాల విషయంలో ప్రస్తుత నిర్ణయం ఏమిటన్న వివరాలు స్పష్టంగా తెలియజేస్తే స్థానికుల్లో అనవసర ఆందోళనకు తావుండదు.

ట్రాఫిక్ చిక్కులకు.. మీ ఆలోచనే పరిష్కారం!



■ నవంబర్ 26--28న టీహబ్‌లో 'మూవ్స్ 2026'

■ టాఫిక్ సమస్యల పరిష్కారంలో ప్రజల సూచనలకు ప్రాధాన్యం

■ పోలీస్, మున్సిపల్ శాఖల సమన్వయంతో ప్రత్యేక కార్యక్రమం

■ ప్రయాణ ఇబ్బందులతోపాటు శబ్ద, వాయు కాలుష్యాన్ని తగ్గించడంపైనా దృష్టి

సామాన్యుడి అస్త్రం / సైబరాబాద్ బ్యూరో :

ఆఫీసుకు సమయానికి చేరుకోవాలంటే ఎంత ముందుగా బయలుదేరాలి, ఇంటికి తిరిగొచ్చేటప్పుడు ట్రాఫిక్‌లో ఎంతసేపు ఆగాల్సి వస్తుందో, సైబరాబాద్‌లో రోజూ ప్రయాణించే ఎంతోమందిని వేధిస్తున్న ప్రశ్నలివి. నగరం విస్తరిస్తోంది.. వాహనాలు పెరుగుతున్నాయి.. అదే సమయంలో రహదారులపై ప్రయాణం మరింత భారమవుతోంది. ఈ సమస్యలకు క్షేత్రస్థాయిలో ఉపయోగపడే పరిష్కారాలను ప్రజల నుంచే తెలుసుకునేందుకు పోలీస్, మున్సిపల్ శాఖలు 'సైబరాబాద్ మూవ్స్ 2026--కమ్ మేక్ యువర్ మూవ్' కార్యక్రమాన్ని చేపడుతున్నాయి.నవంబర్ 26, 27, 28 తేదీల్లో టీహబ్ వేదికగా ఈ కార్యక్రమం జరగనుంది. దీని లక్ష్యాలను సైబరాబాద్ మున్సిపల్ కమిషనర్ డాక్టర్ జి. శ్రీజన, పోలీస్ కమిషనర్ డాక్టర్ ఎం. రమేష్ వివరించారు. ప్రభుత్వ శాఖలు, కార్పొరేట్ సంస్థలు, ప్రజలను ఒకే వేదికపైకి తీసుకొచ్చి నగర ప్రయాణ అవసరాలపై చర్చించడం, ఆచరణకు వీలైన ఆలోచనలను గుర్తించడం కార్యక్రమం ఉద్దేశమని తెలిపారు.

ప్రజలు చెప్పే సమస్యలే ప్రణాళికలకు ఆధారం

హైదరాబాద్ అభివృద్ధిలో సైబరాబాద్ కీలక పాత్ర పోషిస్తోందని మున్సిపల్ కమిషనర్ శ్రీజన అన్నారు. వేగంగా పెరుగుతున్న ప్రాంతంలో ఇప్పటి అవసరాలతోపాటు భవిష్యత్తునూ దృష్టిలో ఉంచుకుని సౌకర్యాలు కల్పించాల్సిన బాధ్యత ఉందని వివరించారు. ఇందుకోసం వివిధ ప్రభుత్వ శాఖలు, కార్పొరేట్ సంస్థలను భాగస్వాములుగా చేస్తామని తెలిపారు.ప్రజలను కార్యక్రమంలో ప్రధాన భాగస్వాములుగా చేర్చి, వారి సూచనలు, సలహాల ఆధారంగా మెరుగైన పరిష్కారాలను రూపొందిస్తామని చెప్పారు. నిత్యం ఆయా మార్గాల్లో ప్రయాణించేవారు ఎదుర్కొనే ఇబ్బందులను తెలుసుకోవడం ద్వారా స్థానిక అవసరాలకు తగిన ప్రణాళికలు రూపొందించేందుకు అవకాశం ఉంటుంది.

పెరుగుతున్న వాహనాలతో మరింత ఒత్తిడి

ట్రాఫిక్ సమస్యలు ప్రజల రోజువారీ జీవితంపై ప్రభావం చూపుతున్నాయని సీపీ రమేష్ తెలిపారు. ప్రతిరోజూ 2,000కు పైగా కొత్త వాహనాలు రోడ్లపైకి వస్తున్నాయని పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో ట్రాఫిక్ నిర్వహణతోపాటు రహదారుల రూపకల్పన, ఇతర మౌలిక సదుపాయాలకు సంబంధించిన సమస్యలను గుర్తించి పరిష్కరించాల్సిన అవసరం ఉందన్నారు.రహేజా మైండ్‌స్పేస్‌లోనే లక్ష మందికి పైగా ఉద్యోగులు పనిచేస్తున్నారని ఆయన వివరించారు. ఇలాంటి ప్రాంతాల్లో ప్రయాణ అవసరాలను దృష్టిలో పెట్టుకుని సంబంధిత సంస్థలు, శాఖలు సమన్వయంతో పనిచేయాలని చెప్పారు. ప్రజల భాగస్వామ్యంతో సమస్యలను గుర్తించేందుకు 'మొబిలిటీ డేటా జామ్' కార్యక్రమాన్ని చేపట్టినట్లు తెలిపారు.

ఆలోచన నుంచి ఆచరణ వరకు..

ట్రాఫిక్ ఇబ్బందులను తగ్గించడంతోపాటు శబ్ద, వాయు కాలుష్యాన్ని నియంత్రించే వినూత్న పరిష్కారాలకూ ప్రాధాన్యం ఇస్తామని సీపీ వెల్లడించారు. ఆసక్తి ఉన్నవారు నమోదు చేసుకుని తమ ఆలోచనలు, సూచనలను అందించవచ్చని తెలిపారు. ఉపయోగకరమైన కొత్త ఆలోచనలను ఆచరణలోకి తీసుకొచ్చేలా చర్యలు చేపడతామని చెప్పారు.నిత్యం ట్రాఫిక్‌లో చిక్కుకునే ఉద్యోగి నుంచి స్థానిక నివాసి వరకు.. సమస్యను అనుభవించే ప్రతి ఒక్కరి సూచనకూ ఈ వేదికలో చోటు కల్పించాలన్నది కార్యక్రమం లక్ష్యం. ప్రజల నుంచి వచ్చిన ప్రతిపాదనల్లో ఏవి ఎంపికవుతాయి, వాటిని ఎక్కడ అమలు చేస్తారు, ప్రయాణికులకు ఎంతమేర ఉపశమనం లభిస్తుందన్నదే ఈ ప్రయత్నానికి అసలైన కొలమానం కానుంది.



మాదాపూర్‌లో హైడ్రా కూల్చివేతలు..
నోటరీ ప్లాట్లు కొన్నవారి గోడు వినేదెవరు?

■నవభారత్‌నగర్ సర్వే నంబర్ 63లో నిర్మాణాల తొలగింపు

■స్థానికుల ఫిర్యాదులతో పోలీసు బందోబస్తు మధ్య హైడ్రా చర్యలు

■ ప్లాట్లు అమ్మి డబ్బులు తీసుకున్నవారిపై చర్యలకు కొనుగోలుదారుల డిమాండ్



సామాన్యుడి అస్త్రం / మాదాపూర్ :

తక్కువ ధరకు స్థలం దొరుకుతోందని నమ్మి డబ్బులు చెల్లించారు. నోటరీ పత్రాలతో ప్లాట్లు కొనుగోలు చేశారు. ఇప్పుడు ఆ స్థలాల్లో నిర్మాణాలను హైడ్రా కూల్చివేస్తుండటంతో తమ పరిస్థితి ఏమిటని కొనుగోలుదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మాదాపూర్‌లోని నవభారత్‌నగర్ సర్వే నంబర్ 63లో చేపట్టిన కూల్చివేతలు.. ప్రభుత్వ స్థలాల పరిరక్షణతోపాటు ప్లాట్ల విక్రయాల వెనుక ఉన్నవారి బాధ్యతను కూడా తెరపైకి తెచ్చాయి.అందిన ప్రాథమిక సమాచారం ప్రకారం.. సర్వే నంబర్ 63లో ప్రభుత్వ స్థలంలో అక్రమంగా నిర్మాణాలు చేపట్టారన్న స్థానికుల ఫిర్యాదులతో హైడ్రా రంగంలోకి దిగింది. ఉదయం నుంచి పోలీసుల బందోబస్తు మధ్య నిర్మాణాలను తొలగించే పనులు చేపట్టింది. గత కొన్ని రోజులుగా ఈ ప్రాంతంలో పెద్దఎత్తున నిర్మాణాలు వెలిశాయన్న ఆరోపణలు ఉన్నాయి.ఈ భూమిలో కొందరు వ్యక్తులు ప్లాట్లు విక్రయించి డబ్బులు వసూలు చేశారని కొనుగోలుదారులు ఆరోపిస్తున్నారు. తక్కువ ధరకు ప్లాట్లు లభిస్తున్నాయని నమ్మి నోటరీ పత్రాలపై కొనుగోలు చేశామని చెబుతున్నారు. కూల్చివేతల నేపథ్యంలో తాము చెల్లించిన డబ్బులు తిరిగి వస్తాయా, తమకు న్యాయం చేసేదెవరని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.స్థలాలు అమ్మినవారు డబ్బులు తీసుకున్నారని, ఇప్పుడు నష్టాన్ని మాత్రం తాము ఎదుర్కోవాల్సి వస్తోందని కొనుగోలుదారులు వాపోతున్నారు. తమ నుంచి డబ్బులు వసూలు చేసినవారిని గుర్తించి చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. వికయాలపై విచారణ జరిపి, తమ డబ్బులు తిరిగి ఇప్పించేలా అధికారులు చొరవ చూపాలని విజ్ఞప్తి చేస్తున్నారు.ఈ వ్యవహారంలో నిర్మాణాల తొలగింపుతోపాటు ప్లాట్ల విక్రయాలు ఎలా జరిగాయన్న అంశంపైనా స్పష్టత రావాల్సి ఉంది. ప్రభుత్వ స్థలంగా పేర్కొంటున్న భూమిని ఎవరు విక్రయించారు? కొనుగోలుదారులకు ఎలాంటి పత్రాలు ఇచ్చారు? నిర్మాణాలు జరుగుతున్న సమయంలో సంబంధిత శాఖలు ఏం చేశాయి? అనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి.కూల్చివేసిన నిర్మాణాల సంఖ్య, భూమి విస్తీర్ణం, ముందస్తు నోటీసులు, విక్రయదారులపై తీసుకోనున్న చర్యలకు సంబంధించి అధికారిక వివరాలు అందాల్సి ఉంది. కొనుగోలుదారుల ఆరోపణలపై సంబంధిత విక్రయదారుల వివరణ కూడా తెలియాల్సి ఉంది.

మైనర్‌పై వేధింపుల ఆరోపణలు..
బంజారాహిల్స్ జిమ్ ట్రైనర్‌పై జీరో ఎఫ్ఐఆర్

■పెళ్లి పేరుతో మోసగించాడని రవిపై ఆరోపణలు

■జీరో ఎఫ్ఐఆర్ నమోదు చేసిన మధురానగర్ పోలీసులు

■కేసు బంజారాహిల్స్ పోలీస్‌స్టేషన్‌కు బదిలీ



సామాన్యుడి అస్త్రం / హైదరాబాద్:

పెళ్లి చేసుకుంటానని నమ్మించి ఓ మైనర్ బాలికను మోసగించడంతోపాటు లైంగికంగా వేధించాడన్న ఆరోపణలు జిమ్ ట్రైనర్ రవిపై వచ్చాయి. అందిన సమాచారం ప్రకారం.. బంజారాహిల్స్‌లోని కల్ట్ జిమ్‌లో ట్రైనర్‌గా పనిచేస్తున్న రవికి సంబంధించిన ఈ వ్యవహారంపై మధురానగర్ పోలీసులు జీరో ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. అనంతరం కేసును బంజారాహిల్స్ పోలీస్‌స్టేషన్‌కు బదిలీ చేశారు.బాలికను పెళ్లి పేరుతో నమ్మించి మోసగించాడనేది రవిపై ప్రధాన ఆరోపణ. లైంగిక వేధింపులకు పాల్పడ్డాడన్న అంశం కూడా ఈ వ్యవహారంలో ఉంది. రవికి మరో మహిళతో సంబంధం ఉందన్న ఆరోపణ సైతం వినిపిస్తోంది. అయితే, ఈ అంశాలకు సంబంధించిన పూర్తి వివరాలు అధికారికంగా వెల్లడికావాల్సి ఉంది.ప్రస్తుతం అందిన సమాచారం జీరో ఎఫ్ఐఆర్ నమోదు, కేసు బదిలీ వరకే పరిమితమైంది. ఘటన ఎప్పుడు జరిగింది, ఫిర్యాదులో పేర్కొన్న ఇతర అంశాలేమిటి, ఏ సెక్షన్ల కింద కేసు నమోదైంది వంటి విషయాలపై పోలీసుల వివరణ రావాల్సి ఉంది. రవి అరెస్టుకు సంబంధించి కూడా నిర్ధారిత సమాచారం అందలేదు.ఈ వ్యవహారంలో బాలిక గోప్యత, భద్రతకు ప్రాధాన్యం ఇవ్వాలి. ఆమెను గుర్తించేలా పేరు, ఫొటో, చదువుతున్న విద్యాసంస్థ లేదా కుటుంబ వివరాలను వెల్లడించకుండా ఉండటం అవసరం. రవిపై వచ్చిన ఆరోపణలు, వాటికి సంబంధించిన వాస్తవాలు పోలీసుల దర్యాప్తులో తేలాల్సి ఉంది.

బైక్‌తో నాలాలో చిక్కుకున్న డెలివరీ ఉద్యోగి..
కాపాడిన పోలీసులు, ఎన్డీఆర్ఎఫ్!

■ విఠల్‌రావునగర్ సమీపంలో భారీ నీటి ప్రవాహంతో ప్రమాదం

■ జెప్టో డెలివరీ ఉద్యోగి అర్జున్‌కుమార్‌ను సురక్షితంగా బయటకు తీసిన బృందాలు

■ ప్రవాహ ఉద్ధృతితో నాలాలోనే బైక్.. పరిస్థితిని పర్యవేక్షిస్తున్న పోలీసులు

సామాన్యుడి అస్త్రం / విఠల్‌రావునగర్:

భారీ నీటి ప్రవాహం ఓ డెలివరీ ఉద్యోగిని ప్రమాదంలో పడేసింది. బైక్‌తో సహా నాలాలో చిక్కుకున్న ఆయనను పోలీసులు, ఎన్డీఆర్ఎఫ్ బృందాలు సురక్షితంగా బయటకు తీసుకొచ్చాయి. విఠల్‌రావునగర్ సమీపంలో రాత్రి 7.30 గంటల సమయంలో ఈ ఘటన చోటుచేసుకుంది.జెప్టోలో డెలివరీ ఉద్యోగిగా పనిచేస్తున్న ఘంటసాల అర్జున్‌కుమార్ (46) భారీ నీటి ప్రవాహం కారణంగా ప్రమాదవశాత్తు బైక్‌తో సహా నాలాలోకి వెళ్లిపోయారు. సమాచారం అందుకున్న పోలీసులు, జాతీయ విపత్తు ప్రతిస్పందన దళం (ఎన్డీఆర్ఎఫ్) బృందాలు వెంటనే ఘటనాస్థలానికి చేరుకున్నాయి. సహాయక చర్యలు చేపట్టి ఆయనను సురక్షితంగా బయటకు తీసుకొచ్చాయి. అర్జున్‌కుమార్ ప్రస్తుతం క్షేమంగా ఉన్నట్లు పోలీసులు తెలిపారు.ఆయనను రక్షించినప్పటికీ బైక్‌ను ఇంకా బయటకు తీయలేకపోయారు. నీటి ప్రవాహం ఉద్ధృతంగా ఉండటంతో వాహనాన్ని వెలికితీయడం సాధ్యం కాలేదని పోలీసులు వెల్లడించారు. ఘటనాస్థలంలో పరిస్థితిని పోలీసు బృందాలు పర్యవేక్షిస్తున్నా యి.



తెలంగాణలో జనసేన ఎన్నికల కసరత్తు..
త్వరలో ఇన్‌చార్జుల ప్రకటన!

■ క్షేత్రస్థాయిలో బలంగా పనిచేసే నాయకులకు బాధ్యతలు: రామ్ తాళ్లూరి ■ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో గడల గెలుపే ముందున్న లక్ష్యమన్న నాయకత్వం ■ కొత్తవారిని ఆహ్వానిస్తూనే పాత కార్యకర్తలకు గౌరవం ఇవ్వాలని పిలుపు ■ పార్టీ బలోపేతం, ఎన్నికల సన్నద్ధతపై 'అలయ్ బలయ్'లో నేతల దిశానిర్దేశం





సామాన్యుడి అస్త్రం / హైదరాబాద్ బ్యూరో :

పన్నెండేళ్లుగా పార్టీ కోసం పనిచేసిన కార్యకర్తలకు గౌరవం.. కొత్తగా వచ్చేవారికి ఆహ్వానం.. క్షేత్రస్థాయిలో బలంగా పనిచేసే నాయకులకు బాధ్యతలు. తెలంగాణలో జనసేనను సంస్థాగతంగా బలోపేతం చేసేందుకు పార్టీ నాయకత్వం ఈ అంశాలపై దృష్టి పెట్టింది. రానున్న ఎన్నికలకు సిద్ధం కావాలని శ్రేణులకు పిలుపునిస్తూనే, ఉమ్మడి ఖమ్మం--నల్గొండ--వరంగల్ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో పార్టీ అభ్యర్థి డాక్టర్ గడల శ్రీనివాసరావును గెలిపించుకోవడమే ముందున్న ప్రధాన లక్ష్యమని స్పష్టం చేసింది. హైదరాబాద్‌లోని జనసేన తెలంగాణ రాష్ట్ర కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన 'అలయ్ బలయ్' ఆత్మీయ సమ్మేళనం ఇందుకు వేదికైంది. రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ గడల శ్రీనివాసరావు అధ్వర్యంలో జరిగిన కార్యక్రమానికి పార్టీ ప్రధాన కార్యదర్శి రామ్ తాళ్లూరి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. తెలంగాణ ఇన్‌చార్జి నేమూరి శంకర్‌గౌడ్, ప్రచార కార్యదర్శి ఆర్.కె. సాగర్ పాల్గొన్నారు. నాయకత్వం నుంచి గ్రామస్థాయి కార్యకర్త వరకు సమన్వయం పెంచుకోవడం, ప్రజాసమస్యలపై కలిసి పనిచేయడం నేతల ప్రసంగాల్లో ప్రధానంగా వినిపించింది.

బాధ్యతలకు క్షేత్రస్థాయి పనితీరే ప్రాధాన్యం

నాయకులు ప్రజల్లోకి వెళ్లి పనిచేసినప్పుడే పార్టీ సంస్థాగతంగా బలపడుతుందని రామ్ తాళ్లూరి స్పష్టం చేశారు. క్షేత్రస్థాయిలో బలంగా పనిచేస్తున్న నాయకులను త్వరలో ఇన్‌చార్జులుగా ప్రకటిస్తామని తెలిపారు. రాజకీయాల్లో యువ నాయకత్వాన్ని ప్రోత్సహించాలని పార్టీ అధ్యక్షుడు పవన్ కల్యాణ్ తరచూ చెబుతుంటారని గుర్తుచేశారు. అవసరమైన బలాన్ని సమకూర్చుకుని ఎన్నికలకు వెళ్లాలని సూచించారు. పార్టీ కోసం పన్నెండేళ్లుగా పడిన కష్టం వృథా కాకుండా ఉండాలంటే మరో రెండేళ్లు పట్టుదలతో పనిచేయాలని కార్యకర్తలు, నాయకులకు పిలుపునిచ్చారు. కొత్తవారిని చేర్చుకోవడంతోపాటు మొదటి నుంచి పార్టీని నమ్ముకుని పనిచేస్తున్న వారికి తగిన గౌరవం ఇవ్వాల్సిన బాధ్యత అందరిపైనా ఉందన్నారు. పార్టీకి అసలైన బలం పదవుల్లో కంటే ప్రజలతో మమేకమై పనిచేసే కార్యకర్తల్లోనే ఉంటుందని పేర్కొన్నారు.

ఎమ్మెల్సీ ఎన్నికలపై ఉమ్మడి దృష్టి

గడల శ్రీనివాసరావు గెలుపు కోసం శ్రేణులంతా కలిసికట్టుగా పనిచేయాలని నేమూరి శంకర్‌గౌడ్ కోరారు. తెలంగాణలో పార్టీ కార్యక్రమాలకు సంబంధించి పవన్ కల్యాణ్ నిర్ణయమే శిరోధార్యమని తెలిపారు. రానున్న ఎన్నికల్లో పోటీ చేసేందుకు నాయకులు, కార్యకర్తలు సిద్ధం కావాలని సూచించారు. 2014 నుంచి పార్టీ కోసం పనిచేస్తున్న కార్యకర్తల కృషిని పవన్ కల్యాణ్ గుర్తిస్తారని చెప్పారు. ఆంధ్రప్రదేశ్‌లో ఆయన చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలను స్ఫూర్తిగా తీసుకుని తెలంగాణలో పార్టీని ముందుకు తీసుకెళ్లాలని పిలుపునిచ్చారు. ఇందిరాపార్క్ ధర్నాచౌక్ వద్ద ఇటీవల జరిగిన దీక్షను ప్రస్తావిస్తూ, వంద గజాల ఇంటి స్థలం కోసం సాధారణ, మధ్యతరగతి కుటుంబాలు, కూలీలు రోడ్డెక్కాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. తమకు అండగా నిలవాలని కోరిన వారికి పార్టీ తరఫున భరోసా ఇచ్చినట్లు తెలిపారు.

నాయకత్వానికి కార్యకర్తలను చేరువ చేయాలి

తెలంగాణలో జనసేనను ప్రత్యామ్నాయ రాజకీయ శక్తిగా తీర్చిదిద్దేందుకు పార్టీ శ్రేణులతోపాటు ప్రజల మద్దతూ అవసరమని గడల శ్రీనివాసరావు అన్నారు. ఉమ్మడి ఖమ్మం, నల్గొండ, వరంగల్ జిల్లాల పట్టభద్రులు ఓటరు నమోదు చేయించుకుని, జనసేన అభ్యర్థిగా తనకు అవకాశం ఇవ్వాలని కోరారు. నాయకత్వం, కార్యకర్తల మధ్య ప్రత్యక్ష సంబంధాలు పెంచడం, పరస్పర విశ్వాసాన్ని బలోపేతం చేయడం సమ్మేళనం ఉద్దేశమని వివరించారు. గ్రామస్థాయి వరకు సమన్వయం పెరగాలని, కార్యకర్తల అభిప్రాయాలు, సూచనలు, సేవలకు సముచిత ప్రాధాన్యం దక్కాలని చెప్పారు. యువత భవిష్యత్తు, విద్య, ఉపాధి, ప్రజారోగ్యం, సామాజిక న్యాయం వంటి అంశాలపై ఉమ్మడిగా పనిచేయాల్సిన అవసరాన్ని ప్రస్తావించారు. అపోహలను తొలగించి అందరినీ ఒకే కుటుంబంగా ముందుకు నడిపించడమే 'అలయ్ బలయ్' లక్ష్యమన్నారు.

కాంగ్రెస్ ప్రభుత్వంపై సాగర్ విమర్శలు

కాంగ్రెస్ ప్రభుత్వం అమలుకు సాధ్యం కాని హామీలతో ప్రజలను ఇబ్బందుల్లోకి నెట్టిందని ఆర్.కె. సాగర్ ఆరోపించారు. రాష్ట్రంలో కరువు పరిస్థితులు, రైతుల సమస్యలను ప్రభుత్వం పట్టించుకోవడం లేదని విమర్శించారు. స్థానిక సమస్యల పరిష్కారంపై దృష్టి పెట్టకుండా ఢిల్లీలో పోరాటం చేస్తామంటూ వెళ్తున్నారని వ్యాఖ్యానించారు. పవన్ కల్యాణ్ పిలుపు మేరకు గడల శ్రీనివాసరావు విజయానికి పార్టీ శ్రేణులు శ్రమించాలని కోరారు. ఆత్మీయ సమ్మేళనంగా నిర్వహించిన ఈ సమావేశంలో ఎన్నికల సన్నద్ధతకు ప్రాధాన్యం కనిపించింది. చాలాకాలంగా పనిచేస్తున్న కార్యకర్తలను కలుపుకొని వెళ్లడం, యువ నాయకత్వాన్ని ప్రోత్సహించడం, క్షేత్రస్థాయిలో బాధ్యతలు అప్పగించడం అనే అంశాలను నాయకత్వం ముందుంచింది. త్వరలో ప్రకటిస్తామన్న ఇన్‌చార్జుల నియామకాలు, గ్రామస్థాయిలో చేపట్టే కార్యాచరణ ఈ పిలుపులను ముందుకు తీసుకెళ్లడంలో కీలకం కానున్నాయి.





మియాపూర్ భూములు అమ్మొద్దు..
పేదలకు ఇళ్ల స్థలాలివ్వండి!

■ సర్వే నంబర్లు 100, 101లోని భూములను ప్రజా అవసరాలకు వినియోగించాలని ఎంసీపీఐ(యూ) డిమాండ్
■ భూములు ప్రభుత్వానివేనన్న సుప్రీంకోర్టు తీర్పుపై పార్టీ హర్షం
■ స్టాలిన్‌నగర్, ముజఫర్ అహ్మద్‌నగర్‌లో పేదల ఇళ్లకు పట్టాలివ్వాలని వినతి
■ ప్రైవేటు సంస్థలకు కేటాయించకుండా భవిష్యత్తు తరాల కోసం కాపాడాలని పిలుపు



సామాన్యుడి అస్త్రం / మియాపూర్ :

మియాపూర్‌లోని విలువైన భూములను విక్రయించడం ద్వారా ఆదాయం సమకూర్చుకోవాలనే ఆలోచనను ప్రభుత్వం విరమించుకోవాలని ఎంసీపీఐ(యూ) నాయకులు డిమాండ్ చేశారు. ఆ భూములను పేదల ఇళ్ల స్థలాలకు, ప్రజా అవసరాలకు వినియోగించాలని కోరారు. సర్వే నంబర్లు 100, 101లోని సుమారు 550 ఎకరాలు ప్రభుత్వ భూములేనని సుప్రీంకోర్టు తీర్పు ఇచ్చినట్లు పేర్కొంటూ హర్షం వ్యక్తం చేశారు. భూముల పరిరక్షణతోపాటు అక్కడ దశాబ్దాలుగా నివసిస్తున్న పేద కుటుంబాల ఇళ్లకు చట్టబద్ధత కల్పించడంపైనా ప్రభుత్వం దృష్టి పెట్టాలన్నారు. మియాపూర్‌లోని ముజఫర్ అహ్మద్‌నగర్ పార్టీ కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో నాయకులు మాట్లాడారు. ప్రభుత్వానికి చెందిన భూమి ప్రజల అవసరాలకు ఉపయోగపడాలన్నదే తమ ప్రధాన డిమాండ్ అని స్పష్టం చేశారు. ప్రైవేటు వ్యక్తులు, సంస్థలకు అప్పగించే ఆస్తిగా చూడకుండా భవిష్యత్తు తరాలకు ఉపయోగపడేలా కాపాడాలని కోరారు.

నాలుగు దశాబ్దాలుగా పోరాడుతున్నామన్న నాయకులు

మియాపూర్ సర్వే నంబర్లు 100, 101లోని భూములు ప్రభుత్వానివేనని తమ పార్టీ నాలుగు దశాబ్దాలుగా చెబుతూ వస్తోందని నాయకులు తెలిపారు. శేరిలింగంపల్లి మండలంలో ప్రభుత్వ భూముల ఆక్రమణలను అడ్డుకోవాలని, పేదలకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలని 1986 నుంచి ప్రజా పోరాటాలు నిర్వహించినట్లు వివరించారు. కొందరు వ్యక్తులు తప్పుడు పత్రాలు సృష్టించి, రెవెన్యూ అధికారులతో కుమ్మక్కై ప్రభుత్వ రికార్డుల్లో పేర్లు నమోదు చేయించుకున్నారని ఆరోపించారు. ఈ భూములను కాపాడాలని అప్పటి ప్రభుత్వాలు, అధికారులకు పలుమార్లు విన్నవించినట్లు చెప్పారు. పార్టీ వ్యవస్థాపక నేత, అప్పటి ఎమ్మెల్యే మద్దికాయల ఓంకార్ 1994లో ఈ భూముల వ్యవహారాన్ని శాసనసభలో ప్రస్తావించారని గుర్తుచేశారు. హక్కుదారులమని చెప్పుకున్న వ్యక్తులు, వివిధ సొసైటీల మధ్య వివాదాలు న్యాయస్థానాలకు చేరాయని తెలిపారు. అనంతరం ప్రభుత్వం కూడా న్యాయపోరాటంలో భాగమైందని, 2003లో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ హైకోర్టు ఈ భూములు ప్రభుత్వానివేనని తీర్పు ఇచ్చిందని నాయకులు పేర్కొన్నారు. సుదీర్ఘ న్యాయపోరాటం తర్వాత సుప్రీంకోర్టు కూడా ప్రభుత్వ హక్కును సమర్థించిందని చెప్పారు.

ఏళ్లుగా నివసిస్తున్న పేదలకు భరోసా కల్పించాలి

సర్వే నంబర్ 100లోని స్టాలిన్‌నగర్, ముజఫర్ అహ్మద్‌నగర్‌లలో పేద కుటుంబాలు దశాబ్దాలుగా నివాసాలు ఏర్పరచుకున్నాయని నాయకులు తెలిపారు. మద్దికాయల ఓంకార్, తాండ్ర కుమార్ నాయకత్వంలో సాగిన ఉద్యమాల ద్వారా అనేకమందికి ఇళ్ల స్థలాలు కల్పించినట్లు చెప్పారు. ఆ ఇళ్లకు చట్టప్రకారం గుర్తింపు, పట్టాలు ఇవ్వాలని ప్రభుత్వాలను కోరుతూ వస్తున్నామన్నారు. భూములపై ప్రభుత్వ హక్కు అంశంతోపాటు అక్కడ నివసిస్తున్న కుటుంబాల పరిస్థితినీ పరిగణనలోకి తీసుకోవాలని కోరారు. ఎన్నో ఏళ్లుగా నివసిస్తున్న పేదల ఇళ్లకు చట్టబద్ధత కల్పించి, వారికి భరోసా ఇవ్వాలని డిమాండ్ చేశారు. మిగిలిన భూముల్లో వివిధ సొసైటీలు, వ్యక్తుల పేరుతో ఆక్రమణలు ఉన్నాయని ఆరోపిస్తూ వాటిని పరిరక్షించాలని కోరారు.

విక్రయాల ఆలోచనపై అభ్యంతరం

ఈ భూములను విక్రయించైనా ప్రజాపాలన కొనసాగిస్తామని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఢిల్లీలో వ్యాఖ్యానించినట్లు పార్టీ నాయకులు పేర్కొంటూ అభ్యంతరం వ్యక్తం చేశారు. తీర్పు వెలువడిన వెంటనే భూముల అమ్మకం గురించి మాట్లాడటం విచారకరమని అన్నారు. హైదరాబాద్ మహానగరంలో ఇంత విస్తీర్ణంలో ఉన్న ప్రభుత్వ భూములను కేవలం ఆదాయం సమకూర్చే వనరుగా చూడటం సరికాదన్నారు. పేదల నివాస అవసరాలు, భవిష్యత్తు ప్రజా ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని వినియోగంపై నిర్ణయం తీసుకోవాలని కోరారు. ప్రైవేటు ప్రయోజనాలకు అప్పగించే ప్రయత్నాలు జరిగితే ప్రజలను సమీకరించి ఉద్యమాలు చేపడతామని తెలిపారు. సమావేశంలో ఎంసీపీఐ(యూ) రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు వనం సుధాకర్, గ్రేటర్ హైదరాబాద్ కార్యదర్శి మైదంశెట్టి రమేష్, సహాయ కార్యదర్శి తుడుం అనిల్‌కుమార్, కార్యదర్శివర్గ సభ్యులు ఇస్లావత్ దశరత్‌నాయక్, పల్లె మురళి, కమిటీ సభ్యులు జి. శివాని, బి.కె. నారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఎట్టకేలకు జలకళ.. సున్నం చెరువు, తమ్మిడికుంటలోకి వర్షపు నీరు!



- పునరుద్ధరించిన చెరువులకు ఇన్‌లెట్ల ద్వారా చేరుతున్న ప్రవాహం.. స్థానికుల ఆనందం
- శుక్రవారం వర్షంతో చెరువుల్లోకి చేరిన నీరు
- సున్నం చెరువులో ప్రవాహాన్ని వీడియోలు తీసి అధికారులకు పంపిన స్థానికులు
- త్వరలో సీఎం చేతుల మీదుగా రెండు చెరువుల ప్రారంభోత్సవం

సామాన్యుడి అస్త్రం / మాదాపూర్:

చెరువును బాగు చేశారు.. పూడిక తొలగించారు.. చుట్టూ నడకదారి, పిల్లలు ఆడుకునేందుకు స్థలాలు సిద్ధమయ్యాయి. ఇక నీరు చేరితే చూడాలన్న స్థానికుల ఎదురుచూపులకు శుక్రవారం కురిసిన వర్షం ఊరటనిచ్చింది. హైడ్రా పునరుద్ధరించిన సున్నం చెరువులోకి ఇన్‌లెట్ల ద్వారా వర్షపు నీరు చేరడంతో పరిసరాల్లో సందడి కనిపించింది. మాదాపూర్‌లోని తమ్మిడికుంటలోకీ ప్రవాహం చేరుతోంది. సున్నం చెరువులోకి నీరు వస్తున్న దృశ్యాలను చూసేందుకు కొందరు స్థానికులు వర్షంలోనే బయటకు వచ్చారు. ఇన్‌లెట్ల నుంచి చెరువులోకి చేరుతున్న ప్రవాహాన్ని సెల్‌ఫోన్లలో చిత్రీకరించారు. ఆ వీడియోలను హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్‌తోపాటు ఇతర అధికారులకు పంపించి ఆనందాన్ని పంచుకున్నారు.

పూడిక తొలగింపు తర్వాత చేరిన వర్షపు నీరు

సున్నం చెరువు పునరుద్ధరణలో భాగంగా 10 నుంచి 15 అడుగుల మేర పేరుకుపోయిన పూడికను తొలగించినట్లు అందిన వివరాలు పేర్కొంటున్నాయి. దుర్గంధాన్ని తగ్గించి, పరిసరాలను ప్రజలు సేదతీరేందుకు అనువుగా హైడ్రా తీర్చిదిద్దింది. చెరువు చుట్టూ నడకదారి, పిల్లల ఆటస్థలాలు, విశ్రాంతి తీసుకునేందుకు గజిబోలు ఏర్పాటు చేసింది. పనులు పూర్తయ్యాక చెరువు నీటితో కళకళలాడుతుందని స్థానికులు ఆశించారు. అయితే వర్షాలు లేకపోవడంతో నీటి కోసం ఎదురుచూడాల్సి వచ్చింది. శుక్రవారం పరిసర ప్రాంతాల్లో సుమారు ఏడు సెంటీమీటర్ల వర్షం కురిసినట్లు అందిన సమాచారం చెబుతోంది. చెరువుకు నీరు చేరే మార్గాలను మెరుగుపరచడంతో ఆ ప్రవాహం ఇన్‌లెట్ల ద్వారా లోపలికి చేరింది.

తమ్మిడికుంటకూ చేరుతున్న ప్రవాహం

మాదాపూర్‌లోని తమ్మిడికుంటలోనూ వర్షపు నీరు చేరుతోంది. ఇక్కడ ఇన్‌లెట్లను అభివృద్ధి చేయడంతో రహదారులపై నిలిచే నీరు చెరువులోకి వెళ్లేందుకు మార్గం ఏర్పడింది. వర్షపు నీరు చేరుతున్న తీరు పునరుద్ధరణ పనుల తర్వాత స్థానికుల్లో ఆశలు పెంచింది. త్వరలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చేతుల మీదుగా సున్నం చెరువు, తమ్మిడికుంటను ప్రారంభించనున్నట్లు సమాచారం. ఈ నేపథ్యంలో రెండు చెరువుల్లోకి నీరు చేరడాన్ని స్థానికులు శుభపరిణామంగా భావిస్తున్నారు. సున్నం చెరువులో పూడిక తొలగించినందున నీరు భూమిలోకి ఇంకేందుకు అవకాశం పెరుగుతుందని, భూగర్భ జలాలకు ఉపయోగపడుతుందని స్థానికులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. ఇటీవల అక్రమ బోర్లను హైడ్రా తొలగించిన నేపథ్యంలో చెరువులో నీరు నిలుస్తుందన్న ఆశనూ వెల్లడిస్తున్నారు. బాగుచేసిన చెరువులోకి ప్రవాహం చేరడం చూసిన ఆనందంతో ఇప్పుడు మరిన్ని వర్షాల కోసం ఎదురుచూస్తున్నారు.

బీఆర్ఎస్ చెర నుంచి భూములకు విముక్తి

మియాపూర్‌లో 550 ఎకరాలను కొట్టేసేందుకు కేసీఆర్, ఆయన బంధువుల ప్లాన్

సుప్రీంకోర్టులో పోరాడి కాపాడాం: సీఎం రేవంత్‌రెడ్డి

ఆ భూములను విక్రయించి నీటిపారుదల, విద్య, వైద్యానికి ఖర్చు

బీఆర్ఎస్ భూ దందాపై చర్చించేందుకు అసెంబ్లీకి కేసీఆర్ రావాలి

మూడేండ్లలో రూ. 1.50 లక్షల కోట్ల విలువైన భూములను కాపాడాం

భూ కబ్జాకు యత్నిస్తే కఠినంగా వ్యవహరిస్తామని హెచ్చరిక



హైదరాబాద్, అక్టోబర్ 30సామాన్యుడి అస్త్రం

బీఆర్ఎస్ పదేండ్ల పాలనలో కొందరు అధికారులను అడ్డంపెట్టుకుని భూములు కొట్టేయాలని ఆ పార్టీ నేతలు చూశారని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. 'గత బీఆర్ఎస్ హయాంలో కబ్జాలకు గురైన భూములను మా ప్రభుత్వం కాపాడుతున్నది. మియాపూర్‌లోని 550 ఎకరాల భూములను కొల్లగొట్టేందుకు కేసీఆర్, ఆయన బంధువులు అనేక రకాలుగా ప్రయత్నించారు. వాటి విలువ రూ. 50 వేల కోట్లు ఉంటుంది' అని తెలిపారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చాక రూ.1.50 లక్షల కోట్ల విలు వైన భూములను రక్షించామన్నారు. శుక్రవారం ఢిల్లీలోని తన అధికారిక నివాసంలో సీఎం రేవంత్‌రెడ్డి మీడియాతో మాట్లాడారుమియాపూర్‌లోని ని 550 ఎకరాలను కాపాడేందుకు గత సర్కార్ ఎలాంటి ప్రయత్నం చేయలేదు. మేం అధికారంలోకి వచ్చాక ఈ కేసుపై ప్రత్యేకంగా దృష్టి సారించి, సుప్రీంకోర్టులో బలమైన వాదనలు వినిపించి రూ.50 వేల కోట్ల విలువ చేసే ఆస్తిని కాపాడుకోగలి గాం. సుప్రీంకోర్టు తీర్పు రాగానే ఈ భూము లు స్వాధీనం చేసుకోవాలని అధికారులను ఆదేశించాం. అవసరమైతే ఈ భూములను వేలం వేసి దళిత, బహుజనుల కోసం ఖర్చు చేస్తాం' అని ప్రకటించారు. ఆ భూములను విక్రయించి నీటిపారుదల, విద్యా, వైద్యం వం టి తదితర రంగాలకు కేటాయిస్తామన్నారు. ఈ అంశంపై క్యాబినెట్‌లో చర్చిస్తామని ఆయ న తెలిపారు.

కోర్టులకు వెళ్లి కాపాడాం

'బీఆర్ఎస్ నాయకులు కంచె గచ్చిబౌలి, మామిడిపల్లి భూములను కొట్టేసేందుకు ప్ర యత్నిస్తే న్యాయ పోరాటంలో గెలిచాం. మా ప్రభుత్వం వచ్చిన మూడేండ్లలో రూ. 1.50 లక్ష కోట్ల విలువైన భూములను రక్షించాం. ఐఎంజీ భూములను భలేరావు కుటుంబ సభ్యులతో కుమ్మక్కై కేటీఆర్ కొట్టేయాలని చూస్తే న్యాయపోరాటంతో అడ్డుకున్నాం. గు ర్రంగూడ అటవీ భూములను కేటీఆర్ అనుచరులు కబ్జాకు ప్రయత్నిస్తే సుప్రీంకోర్టులో పోరాడాం. ప్రభుత్వం పోరాటంతో అది అట వీ భూమి అని సుప్రీంకోర్టు తెల్చి చెప్పింది. మంచిరేవులలో 143 ఎకరాల భూమిని కేటీఆర్ రాయలసీమ బిల్డర్స్‌తో కలిసి కబ్జాకు ప్ర యత్నిస్తే దానినీ రక్షించాం. అందులో పోలీసుల పిల్లల కోసం స్కూల్ పెట్టాం.జయ శంకర్ భూపాలపల్లి జిల్లాలో 400 ఎకరాల అటవీ భూమిని బీఆర్ఎస్‌లోకి ఫిరాయించిన ఎమ్మెల్యేకు నజరానాగా అప్పగిస్తే సుప్రీంకోర్టులో పోరాడి రక్షించాం. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో బీఆర్ ఎస్ నాయకుల భూ ఆక్రమణలను అడ్డుకున్నాం' అని ముఖ్యమంత్రి రేవం త్‌రెడ్డి తెలిపారు. వనరుల సమీకరణకు నియమించిన మంత్రివర్గ ఉప సంఘం ఈ భూము ల విక్రయంపై చర్చించి.. వచ్చే ఆ నిధులతో చేపట్టే అభివృద్ధి పనులపై అధ్యయనం చేస్తుందన్నారు. ఎల్బీనగర్ నియోజక వర్గంలోని హ యత్‌నగరలో ఉన్న 150 ఎకరాలను కా పాడి అటవీ ప్రాంతంగా మార్చామని ఆయన తెలిపారు.

సర్వే చేయకుండా అడ్డుకుంటున్నారు

'మాజీ మంత్రి హరీశ్ రావు మామ హనుమంతరావు కబ్జా పెట్టిన భూములను అధికా రులు సర్వే చేయకుండా అడ్డుకుంటున్నారు. పైగా కోర్టుకు వెళ్లి స్టే తెచ్చుకున్నారు. భూము ల ఆక్రమణపై బీఆర్ఎస్ నాయకులు ప్రభుత్వంపై అనేక తప్పుడు ఆరోపణలు చేశారు. శాసనసభలో చర్చ పెట్టి చర్యలకు దిగితే తేలు కుట్టిన దొంగల్లా వ్యవహరిస్తున్నారు' అని సీఎం రేవంత్‌రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. మియాపూర్ భూములపై ప్రభుత్వానికి అనుకూలంగా తీర్పు వస్తే ఎందుకు బీఆర్ఎస్ నాయకులు స్పందించడం లేదని ఆయన ప్రశ్నించారు.కనీసం రెవెన్యూ అధికారులను బీఆర్ఎస్ నాయకులు ఎందుకు అభినందించడం లేదన్నారు. 'ఉమ్మడి రాష్ట్రంలో పద్మాల య స్టూడియో, ల్యాంకో భూములపై కేసులు వేసిన కేసీఆర్, హరీశ్ రావు బీఆర్ఎస్ అధికారంలోకి వచ్చిన తర్వాత ఎందుకు వాటిని స్వాధీనం చేసుకోలేదు? అధికారంలోకి వచ్చి న తర్వాత ఎవరిపై కేసులు వేశారో వారితోనే కేసీఆర్, హరీశ్ రావు లాలూచీ పడ్డారు. రెండు గ్రామాల మధ్య వివాదాన్ని కేసీఆర్ తనకు అనుకూలంగా మలచుకున్నారు. అక్కడి ఆక్రమణలను తేల్చి శ్రీకాంతాచారి అమరవీరుల కాలనీ నిర్మిస్తాం. కేసీఆర్, కేటీఆర్ ఇప్పటికైనా బుద్ధి మార్చుకొని.. ఆక్రమణలు చేయడం మానుకోవాలి. వాళ్ల ఆక్రమణలకు వ్యతిరేకంగా కోర్టులు తీర్పులు ఇస్తున్నాయి' అని సీఎం తెలిపారు.

కబ్జా చేస్తే కఠిన చర్యలు

మియాపూర్ భూములపై ఇప్పటికైనా బీఆర్ఎస్ నేతలు కుట్రలు మానుకోవాలని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. తెలంగాణలో అత్యంత విలువైన ప్రభుత్వ భూములున్నాయో వాటిని తన కుటుంబ సభ్యులు, అనుచరుల మీదికి బదిలీ చేసి కొట్టేసేందుకు తీవ్రంగా ప్రయత్నించారు. కేసీఆర్, కుటుంబ సభ్యులు, బీఆర్ఎస్ నాయకులు విలువైన భూములు కబ్జాకు ప్రయత్నించారు. నేను ఎమ్మెల్యేగా, ఎంపీగా, పీసీసీ అధ్యక్షుడిగా ఉన్నప్పుడు భూ కబ్జా వ్యవహారాలపై పోరాడితే కక్ష గట్టి జైలుకు పంపారు' అని సీఎం తెలిపారు. భూ కబ్జాకు యత్ని స్తే ప్రభుత్వం కఠినంగా వ్యవహరిస్తుందని హెచ్చరించారు. ఈ భూములపై సుప్రీంకోర్టు తీర్పునకు ధన్యవాదాలు తెలియజేశారు.

సింగరేణి కార్మికులకు డబుల్ ధమాకా!



దీపావళి పండుగకూ బోనస్

నవంబర్ 5న ఉద్యోగుల ఖాతాల్లో నగదు జమ

ఒక్కో కార్మికుడికి గరిష్టంగా రూ.1,10,250

38 వేల మందికి రూ.419 కోట్లు

డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క వెల్లడి

హైదరాబాద్, అక్టోబరు 30సామాన్యుడి అస్త్రం

ఇటీవలే దసరా పండుగ కానుకగా భారీగా లాభాల వాటా బోనస్ అందుకున్న సింగరేణి కార్మికులకు రాష్ట్ర ప్రభుత్వం మరో తీపి కబురు చెప్పింది. దీపావళి పండుగకూ బోనస్‌ను చెల్లించనున్నట్టు ప్రకటించింది. ఈ మేరకు డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క శుక్రవారం విడుదల చేసిన ప్రకటనలో సింగరేణి ఉద్యోగులకు దీపావళి శుభాకాంక్షలు తెలియజేస్తూ పెర్ఫార్మెన్స్ లింక్డ్ రివార్డ్ బోనస్‌ను నవంబర్ 5న చెల్లించాల్సిందిగా యాజమాన్యాన్ని ఆదేశించారు.దీపావళి బోనస్‌గా రూ.419 కోట్లను చెల్లించనున్నట్లు, ఒక్కో కార్మికుడికి గరిష్టంగా రూ.1,10,250 చొప్పున లబ్ధి చేకూరుతుందని వివరించారు. రాష్ట్రానికి వెలుగులు పంచుతున్న సింగరేణి సంస్థ అభివృద్ధి విస్తరణకు ప్రజా ప్రభుత్వం ప్రణాళికాబద్ధంగా ప్రయత్నిస్తోందని పేర్కొన్నారు. లాభాల వాటా కింద ఈ నెలలో దాదాపు 600 కోట్ల రూపాయలు చెల్లించగా.. తాజాగా రూ.419 కోట్ల దీపావళి బోనస్ చెల్లించబోతున్నట్లు తెలిపారు. బొగ్గు రంగంలో పోటీని అధిగమించేందుకు బొగ్గు ఉత్పత్తి వ్యయాన్ని తగ్గించే ప్రయత్నం చేయాలని సూచించారు. డిప్యూటీ సీఎం ఆదేశాలపై సింగరేణి సీఎండీ డాక్టర్ బుద్ధప్రకాష్ జ్యోతి సంబంధిత పర్సనల్, ఫైనాన్సు అధికారులతో మాట్లాడి నవంబర్ 5వ తేదీన దీపావళి బోనస్ ను కార్మికుల బ్యాంకు ఖాతాల్లో చెల్లింపునకు తగిన ఏర్పాటు చేయాలని ఆదేశించారు.

ఎన్‌సీడబ్ల్యూఏ ఉద్యోగులకే వర్తింపు

దీపావళి బోనస్ కేవలం ఎన్‌సీడబ్ల్యూఏ ఉద్యోగులకు మాత్రమే వర్తించనుంది. ఇది అధికారులకు వర్తించదు. గత ఆర్థిక సంవత్సరంలో భూగర్భ గనుల విభాగంలో 190 పని దినాలు, ఓపెన్ కాస్ట్, సర్ఫేస్ విభాగాల్లో 240 పని దినాలు పూర్తి చేసిన కార్మికులకు పూర్తిస్థాయిలో బోనస్ అందుతుంది. అంతకంటే తక్కువ పని దినాల హాజరు కలవారికి వారు పని చేసిన కాలానికి నిష్పత్తి ప్రకారం బోనస్‌ను లెక్క కట్టి చెల్లించనున్నారు. అయితే ఈ బోనస్ పొందడానికి కనీస అర్హతగా గత ఆర్థిక సంవత్సరంలో ఏ కార్మికుడైనా కనీసం 30 రోజులు పని చేసి ఉండాలని నిర్ణయించారు.మొత్తం మీద సుమారు 38,000 మంది ఉద్యోగులకు బోనస్ వర్తించనుంది. నెల రోజుల వ్యవధిలోనే దసరా, దీపావళి బోనస్‌ల రూపంలో సగటున దాదాపు 2,65,000 రూపాయలు కార్మికులకు అందనున్నాయి. సింగరేణి యాజమాన్యం ఈ రెండు బోనస్‌ల కింద కార్మికులకు సుమారు రూ.1,020 కోట్ల రూపాయలను చెల్లించింది. సంస్థ చైర్మన్, ఎండీ డాక్టర్ బుద్ధప్రకాష్ జ్యోతి సింగరేణి ఉద్యోగులకు తన దీపావళి శు భాకాంక్షలు తెలియజేస్తూ కార్మికులు బోనస్‌ల సొమ్మును తమ కుటుంబ అవసరాలకు వినియోగించుకోవాలని, అవకాశం ఉంటే పొదుపు చేసుకోవాలని సూచించారు. ప్రతీ ఒక్కరూ పండుగల స్ఫూర్తితో ఉత్సాహంగా పనిచేయాలని గనుల వారీగా, శాఖల వారీగా నిర్దేశించిన లక్ష్యాలు సాధించాలని కోరారు.

కాంట్రాక్ట్ అధ్యాపకులను క్రమబద్ధీకరించాలి

ఉద్యోగ భద్రత కల్పించి, వేతనాలు పెంచాలి

బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు, ఎంపీ ఆర్. కృష్ణయ్య

శాశ్వత నియామకాలు చేపట్టాలి

బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్ రాంచందర్‌రావు

ముషీరాబాద్, అక్టోబర్ 30 సామాన్యుడి అస్త్రం

రాష్ట్రంలోని విశ్వవిద్యాలయాల్లో పనిచేస్తున్న కాంట్రాక్ట్ అసిస్టెంట్ ప్రొఫెసర్లు, అధ్యాపకులు, ఉద్యోగుల సమస్యలను ప్రభుత్వం తక్షణమే పరిష్కరించి, వారి సేవలను క్రమబద్ధీకరించాలని జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు, ఎంపీ ఆర్ కృష్ణయ్య డిమాండ్ చేశారుఈకాంట్రాక్ట్ అధ్యాపకులకు ఉద్యోగ భద్రత కల్పించడంతోపాటు వారి దీర్ఘకాలిక సేవలను ప్రభుత్వం గుర్తించాలని కోరారు. శుక్రవారం బషీర్‌బాగ్ ప్రెస్ క్లబ్‌లో వర్సిటీ టీచర్స్ అసోసియేషన్ కాంట్రాక్ట్ అసిస్టెంట్ ప్రొఫెసర్ల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ పరశురాం అధ్యక్షతన 12 విశ్వవిద్యాలయాల్లో పనిచేస్తున్న కాంట్రాక్టు అధ్యాపకులను విలీనం, క్రమబద్ధీకరణ చేయాలని, చేసే వరకు ఉద్యోగ భద్రతతో కూడిన 7 వ పీఆ ర్సీ, యూజీసీ స్కెల్స్ అమలు చేసిన తరువా తనే నియామకాలు చేపట్టాలని అనే అంశంపై అఖిలపక్ష సమావేశం జరిగిందిఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఎంపీ ఆర్ కృష్ణయ్య మాట్లాడుతూ.. గతంలో ప్రతిపక్షంలో ఉన్నప్పుడు ప్రస్తుత సీఎం రేవంత్‌రెడ్డి సైతం కాంట్రాక్ట్ అధ్యాపకుల డిమాండ్లు న్యాయమైనవేనని పేర్కొన్నారని గుర్తుచేశారు. ఇప్పుడు ప్రభుత్వం చిత్తశుద్ధితో వ్యవహరిస్తే అసెంబ్లీలో ప్రత్యేక చట్టం తీసుకొచ్చి సమస్యను పరిష్కరించవచ్చన్నారు. యూజీసీ నిబంధనలను పరిశీలించడంతోపాటు ఇతర రాష్ట్రాల్లో కాంట్రాక్ట్ అధ్యాపకుల సమస్యలను ఎలా పరిష్కరించారో అధ్యయనం చేయాలని సూచించారుబీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్ రాంచందర్‌రావు మాట్లాడుతూ కాంట్రాక్ట్ లెక్చరర్ల సమస్యలను పరిష్కరించి వారికి ఉద్యోగ భద్రత కల్పించాలని కోరారు.

హైదరాబాద్‌ను ముంచెత్తిన భారీ వర్షం.. నగర జీవనం అస్తవ్యస్తం



హైదరాబాద్‌ను ముంచెత్తిన కుండపోత వర్షం

ప్రధాన రహదారులన్నీ జలమయం

పలు ప్రాంతాల్లో గంటల తరబడి నిలిచిపోయిన ట్రాఫిక్

ఇళ్లకు వెళ్లే వేళ ఉద్యోగులు, ప్రయాణికుల తీవ్ర ఇబ్బందులు

ఎండ వేడిమి నుంచి నగరవాసులకు ఊరట

హైదరాబాద్, అక్టోబర్30సామాన్యుడి అస్త్రం

శుక్రవారం సాయంత్రం హైదరాబాద్‌లోని పలు ప్రాంతాల్లో ఉరుములు, మెరుపులతో కూడిన భారీ వర్షం కురిసింది. అకస్మాత్తుగా కురిసిన కుండపోత వానతో నగర జీవనం అస్తవ్యస్తంగా మారింది. గంటకు పైగా ఏకధాటిగా వర్షం పడటంతో రోడ్లన్నీ జలమయమయ్యాయి. డ్రైనేజీలు పొంగిపొర్లడంతో పలు లోతట్టు ప్రాంతాలు నీట మునిగాయి.నగరంలోని ఖైరతాబాద్, పంజాగుట్ట, సోమాజిగూడ, అమీర్‌పేట్, ఎస్ఆర్ నగర్, జూబ్లీహిల్స్, బంజారాహిల్స్, ఫిల్మ్ నగర్ వంటి ప్రధాన ప్రాంతాల్లో రోడ్లపైకి భారీగా వరద నీరు చేరింది. దీంతో ఆఫీసుల నుంచి ఇళ్లకు వెళ్లే ఉద్యోగులు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. సాయంత్రం రద్దీ సమయం కావడంతో ట్రాఫిక్ కష్టాలు రెట్టింపయ్యాయి.ముఖ్యంగా ఐటీ కారిడార్‌లో పరిస్థితి తీవ్రంగా మారింది. మాదాపూర్, హైటెక్‌సిటీ, కేపీహెచ్‌బీ, మైండ్‌స్పేస్, ఐకియా మార్గాల్లో వాహనాలు కిలోమీటర్ల మేర బారులు తీరాయి. మాదాపూర్ సిటీ వైన్స్ వద్ద ప్రధాన రహదారి చెరువును తలపించడంతో రాకపోకలు పూర్తిగా స్తంభించాయి. కుత్బుల్లాపూర్ నుంచి సూరారం వరకు, షాపూర్ నుంచి గాజులరామారం వరకు కూడా భారీగా ట్రాఫిక్ జామ్ అయింది. వర్షానికి తడుస్తూ కొందరు ప్రయాణికులు మెట్రో పిల్లర్ల కింద తలదాచుకోగా, మరికొందరు గంటల తరబడి ట్రాఫిక్‌లోనే చిక్కుకుపోయారు.ఉప్పల్, ఎల్బీనగర్, మణికొండ, రాయదుర్గం, రాజేంద్రనగర్ వంటి నగర శివారు ప్రాంతాల్లోనూ ఇదే పరిస్థితి కనిపించింది. అయితే, గత కొన్ని రోజులుగా నగరంలో తీవ్రమైన ఎండలు, ఉక్కపోతతో అల్లాడిపోతున్న ప్రజలకు ఈ వర్షం కాస్త ఉపశమనం కలిగించింది.

తెలంగాణ వ్యవసాయ రంగంలో చారిత్రక మైలురాయి



తొలిసారిగా ఆస్ట్రేలియాకు ఎగుమతి అయిన తాండూరు కందిపప్పు

జీఐ ట్యాగ్ పొందిన ఈ పప్పుకు ప్రపంచవ్యాప్తంగా పెరుగుతున్న డిమాండ్

ఈ పరిణామంతో రైతులకు, ఎగుమతిదారులకు లబ్ధి చేకూరుతుందని కేంద్రం వెల్లడి

2022 డిసెంబర్‌లో భౌగోళిక గుర్తింపు పొందిన తెలంగాణ ఉత్పత్తి

వికారాబాద్ జిల్లా తాండూరు ప్రాంతంలో ప్రత్యేకంగా పండే ఈ పంట

హైదరాబాద్, అక్టోబర్30సామాన్యుడి అస్త్రం

తెలంగాణ వ్యవసాయ రంగంలో మరో చారిత్రక ఘట్టం ఆవిష్కృతమైంది. రాష్ట్రానికి చెందిన, భౌగోళిక గుర్తింపు (జీఐ ట్యాగ్) పొందిన ప్రసిద్ధ తాండూరు కందిపప్పు తొలిసారిగా ఆస్ట్రేలియాకు ఎగుమతి అయింది. మొత్తం 2.5 మెట్రిక్ టన్నుల పప్పుతో కూడిన మొదటి కన్‌సైన్‌మెంట్‌ను తాజాగా ఆస్ట్రేలియాకు పంపించారు. ఈ పరిణామం తెలంగాణ వ్యవసాయ ఉత్పత్తులకు అంతర్జాతీయ మార్కెట్‌లో పెరుగుతున్న ప్రాధాన్యతను, డిమాండ్‌ను చాటుతోంది.ఈ విషయాన్ని కేంద్ర వాణిజ్య, పరిశ్రమల శాఖ మంత్రి పీయూష్ గోయల్ సోషల్ మీడియా వేదికగా ప్రకటించారు. "భారత జీఐ ఉత్పత్తులు ప్రపంచాన్ని గెలుస్తున్నాయి!" అంటూ ఆయన హర్షం వ్యక్తం చేశారు. ఈ ఎగుమతి ద్వారా భారతీయ రుచులు ఆస్ట్రేలియాలోని ఇళ్లకు చేరుతాయని, ప్రామాణికమైన భారత వ్యవసాయ ఉత్పత్తులకు అంతర్జాతీయంగా డిమాండ్ పెరగడం వల్ల రైతులు, ఎగుమతిదారులు ప్రయోజనం పొందుతున్నారని ఆయన పేర్కొన్నారు. ఈ ఎగుమతితో తాండూరు కందిపప్పుకు సరికొత్త విదేశీ మార్కెట్ ద్వారాలు తెరుచుకున్నాయని అధికారులు తెలిపారు.తాండూరు కందిపప్పుకు 2022 డిసెంబర్‌లో భౌగోళిక గుర్తింపు లభించిన సంగతి తెలిసిందే. తెలంగాణ నుంచి జీఐ ట్యాగ్ పొందిన తొలి పప్పుధాన్యపు పంట ఇదే కావడం విశేషం. ఈ గుర్తింపు వల్ల ఈ ఉత్పత్తికి చట్టపరమైన రక్షణ లభించడంతో పాటు ఇతర ప్రాంతాల్లో పండే కందిపప్పుతో పోలిస్తే తాండూరు పప్పు ప్రత్యేకతను ఇది అధికారికంగా తెలియజేస్తుంది. ఈ ట్యాగ్ లభించిన తర్వాత విదేశాలకు ఎగుమతి కావడం ఇదే తొలిసారి కావడం గమనార్హం.తాండూరు కందిపప్పును ప్రధానంగా వికారాబాద్ జిల్లాలోని తాండూరు మండలం, దాని చుట్టుపక్కల ప్రాంతాల్లో పండిస్తారు. ఈ ప్రాంతంలోని లోతైన నల్లరేగడి నేలలు ఈ పంటకు అత్యంత అనుకూలంగా ఉంటాయి.

తెలంగాణ ప్రభుత్వం మరో మానవీయ నిర్ణయం



ఇక అన్ని ప్రధాన సామాజిక భద్రతా పింఛన్లలోనూ ఇన్‌స్టంట్ పెన్షన్ సదుపాయం

మంత్రి సీతక్క ఆదేశాలతో దివ్యాంగులు, గీత కార్మికులు, చేనేత కార్మికులు, డయాలసిస్, హెచ్ఐవీ, ఫైలేరియా బాధితుల కుటుంబాలకు ఊరట

పింఛన్‌దారుడైన భర్త మరణిస్తే అర్హత మేరకు భార్యకు తక్షణమే పింఛన్ మంజూరు

హైదరాబాద్, అక్టోబర్ 30సామాన్యుడి అస్త్రం

సామాజిక భద్రతకు పెద్దపీట వేస్తూ తెలంగాణ ప్రభుత్వం మరో మానవీయ నిర్ణయం తీసుకుంది. పింఛన్‌దారులైన భర్తలు మరణించిన సందర్భాల్లో వారి భార్యలకు తక్షణమే సామాజిక భద్రతా పింఛన్ మంజూరు చేసే ఇన్‌స్టంట్ పెన్షన్ సదుపాయాన్ని మరిన్ని కేటగిరీలకు విస్తరిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. మంత్రి సీతక్క ఆదేశాలతో తీసుకున్న ఈ నిర్ణయం ద్వారా దివ్యాంగులు, గీత కార్మికులు, చేనేత కార్మికులు, డయాలసిస్, హెచ్ఐవీ బాధితులు, ఫైలేరియా బాధితుల కుటుంబాలకు ప్రయోజనం కలగనుంది.

మహిళ ఆర్థికంగా ఇబ్బందులు పడకుండా..

ఇప్పటివరకు వృద్ధాప్య పింఛన్ పొందుతున్న భర్త మరణించిన సందర్భంలో ఆయన భార్యకు ఇన్‌స్టంట్ పెన్షన్ మంజూరు చేసే సదుపాయం అమల్లో ఉంది. తాజాగా ప్రభుత్వం ఈ సదుపాయాన్ని ఇతర పింఛన్ కేటగిరీలకు కూడా విస్తరించింది. దీనికి సంబంధించి పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మార్గదర్శకాలను జారీ చేసింది. జీవిత భాగస్వామిని కోల్పోయిన మహిళ ఆర్థికంగా ఇబ్బందులు పడకుండా అండగా నిలవాలన్న లక్ష్యంతో ప్రభుత్వం ఈ విధానాన్ని రూపొందించింది. మరణించిన పురుష పింఛన్‌దారుడి భార్య వయస్సు 57 సంవత్సరాల కంటే తక్కువగా ఉంటే వితంతు పింఛన్, 57 సంవత్సరాలు లేదా అంతకంటే ఎక్కువ ఉంటే వృద్ధాప్య పింఛన్ మంజూరు చేయనున్నారు.గ్రామీణ ప్రాంతాల్లో పంచాయతీ కార్యదర్శికి, పట్టణ ప్రాంతాల్లో బిల్ కలెక్టర్‌కు దరఖాస్తుతో పాటు భార్య ఆధార్ కార్డు, బ్యాంకు పాస్‌బుక్ మొదటి పేజీ, మరణించిన పింఛన్‌దారుడి ఆధార్ కార్డు, మరణ ధ్రువీకరణ పత్రం సమర్పించాలి. సంబంధిత అధికారులు పత్రాలను పరిశీలించి, చెయూత పోర్టల్‌లో వివరాలు నమోదు చేసి అర్హత ధ్రువీకరించుకున్న తర్వాత పెన్షన్ మంజూరు చేయనున్నారు. భర్తను కోల్పోయిన మహిళలకు ఆర్థిక భరోసా కల్పించడం, కుటుంబానికి అందుతున్న సామాజిక భద్రతా సహాయం కొనసాగాలని ఉద్దేశంతో ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుంది.

హైదరాబాద్‌కు జనవరి నుంచి 8 నెలల పాటు భారీ నీటి కష్టాలు



భాగ్యనగరానికి తాగునీటి గండం

మంజీరా, సింగూరు ప్రాజెక్టుల నుంచి 100 యంజీడీ నీటి కొరత అంచనా

హైదరాబాద్‌లో 7 నియోజకవర్గాలపై నీటి సంక్షోభ ప్రభావం

హైదరాబాద్, అక్టోబర్30సామాన్యుడి అస్త్రం

హైదరాబాద్ నగరానికి 8 నెలల పాటు తీవ్ర నీటి కష్టాలు తప్పవని జలమండలి ఎండీ అశోక్ రెడ్డి స్పష్టం చేశారు. మంజీరా, సింగూరు జలాశయాలు అడుగంటిపోవడంతో సుమారు రోజుకు 100 మిలియన్ గ్యాలన్ల యంజీడీ నీటి కొరత ఏర్పడనుందని ఆయన తెలిపారు. ఈ ప్రభావం వచ్చే ఏడాది జనవరి నుంచి సెప్టెంబర్ వరకు ఉంటుందని హెచ్చరించారు.ప్రాజెక్టులలో నీటి మట్టాలు పడిపోవడం, భూగర్భ జలాలు తగ్గడంతో సమస్య తీవ్రంగా మారిందని అశోక్ రెడ్డి వివరించారు. ఈ కొరతను అధిగమించేందుకు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. గోదావరి నుంచి 100 యంజీడీ, కృష్ణా నది నుంచి 10–15 యంజీడీ, ఉస్మాన్‌సాగర్ నుంచి మరో 5 యంజీడీ నీటిని నగరానికి తరలించడానికి ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామన్నారు. ఈ చర్యల ద్వారా 60 శాతం కొరతను భర్తీ చేయగలిగినా, మరో 20 నుంచి 40 శాతం నీటి ఎద్దడి కొనసాగుతుందని ఆయన అంగీకరించారు.ఈ నీటి సంక్షోభం ప్రభావం నగరంలోని ఏడు నియోజకవర్గాలపై అధికంగా ఉంటుందని అశోక్ రెడ్డి పేర్కొన్నారు. ముఖ్యంగా శేరిలింగంపల్లిలో 80 శాతం వరకు నీటి సమస్య ఉండొచ్చని అంచనా వేశారు. అలాగే పటాన్‌చెరు నుంచి నార్సింగి వరకు ఉన్న ప్రాంతాల్లో సుమారు 3 లక్షల కనెక్షన్లకు నీటి సరఫరాలో ఇబ్బందులు తప్పవని తెలిపారు. దీంతో రాబోయే రోజుల్లో నగరవాసులు నీటిని పొదుపుగా వాడుకోవాలని అధికారులు సూచిస్తున్నారు.

ప్రపంచ సాంకేతిక కేంద్రంగా తెలంగాణ

మౌలిక వసతులు, ఆవిష్కరణలకు అనుకూలమైన వాతావరణం

డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క

పోచారం ఇన్ఫోసిస్‌లో నూతన సాఫ్ట్‌వేర్ డెవలప్‌మెంట్ బ్లాక్ ఏర్పాటు

ప్రారంభించిన ఉప ముఖ్యమంత్రి భట్టి, మంత్రి శ్రీధర్‌బాబు



ఘట్ కేసర్, అక్టోబర్ 30 సామాన్యుడి అస్త్రం

తెలంగాణను ప్రపంచస్థాయి సాంకేతిక కేంద్రంగా తీర్చిదిద్దే దిశగా హైదరాబాద్‌లోని పోచారం ఇన్ఫోసిస్ డెవలప్‌మెంట్ సెంటర్(మరో కీలక మైలురాయిని చేరుకుంది. పోచారం క్యాంపస్‌లో కొత్తగా నిర్మించిన 1.1 మిలియన్ చదరపు అడుగుల విస్తీర్ణంలోని సాఫ్ట్ వేర్ డెవలప్‌మెంట్ బ్లాక్‌కు డిప్యూటీ సీఎం, ఆర్థిక శాఖ మంత్రి మల్లు భట్టి విక్రమార్క, ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు శుక్రవారం ప్రారంభించారు.ఈ విస్తరణతో తెలంగాణలో తమ కార్యకలాపాలను మరింత బలోపేతం చేయడంతో పాటు, యువతకు అధునాతన సాంకేతిక రంగాల్లో ఉపాధి అవకాశాలు పెంచనున్నట్లు ఇన్ఫోసిస్ వెల్లడించింది. 450 ఎకరాల్లో విస్తరించి ఉన్న పోచారం ఇన్ఫోసిస్ క్యాంపస్లో ఇప్పటికే ఏడు సాఫ్ట్వేర్ డెవలప్మెంట్ బ్లాక్లు, సుమారు 4.58 మిలియన్ చదరపు అడుగుల కార్యాలయ విస్తీర్ణం ఉన్నాయని, తాజాగా ప్రారంభించిన నూతన భవనంతో అదనంగా 10 వేల ఉద్యోగుల సీటింగ్ సామర్థ్యం అందుబాటులోకి రానుందని తెలిపారు.ఈ సందర్భంగా ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మాట్లాడుతూ ప్రపంచస్థాయి మౌలిక సదుపాయాలు, నైపు ణ్యం కలిగిన యువత, ఆవిష్కరణలకు అనుకూలమైన వాతావరణంతో తెలంగాణ ప్రపం చ సాంకేతిక కేంద్రంగా ఎదుగుతోందన్నారు. పోచారం ఇన్ఫోసిస్ క్యాంపస్ విస్తరణ రాష్ట్ర ఐటీ రంగ అభివృద్ధిలో మరో ముఖ్యమైన మైలురాయిగా నిలుస్తుందన్నారు. ఇలాంటి పెట్టుబడులు యువతకు నూతన ఉపాధి అవకాశాలను కల్పించడంతో పాటు హైదరాబాద్ ను అంతర్జాతీయ ఐటీ గమ్యస్థానంగా మరిం త బలోపేతం చేస్తాయని తెలిపారు.ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్‌బాబు ఈ సందర్భంగా రాష్ట్రంలో పెట్టుబడులు, సాంకేతిక అభివృద్ధికి ప్రభుత్వం అందిస్తున్న ప్రోత్సాహాన్ని వివరించారు. ఇన్ఫోసిస్ చీఫ్ ఫైనాన్షి యల్ ఆఫీసర్ జయేష్ సంఘురాజ్ కా మాట్లాడుతూ హైదరాబాద్ తమ సంస్థ వృద్ధి ప్ర యాణంలో కీలక పాత్ర పోషిస్తోందని, పోచా రం క్యాంపస్ విస్తరణ తెలంగాణ పట్ల సంస్థకు ఉన్న నిబద్ధతకు నిదర్శనమని పేర్కొన్నారు. కొత్త కేంద్రం ద్వారా ప్రపంచస్థాయి క్లయింట్లకు అధునాతన సాంకేతిక సేవలు అందించ డంతో పాటు, ప్రత్యేక నైపుణ్యాలు కలిగిన ప్ర తిభావంతులను తీర్చిదిద్దేందుకు అవకాశం కలుగుతుందన్నారు.

మియాపూర్ భూముల వేలాన్ని అడ్డుకుంటాం



కోర్టు తీర్పు రాగానే అమ్ముతారా?

రేవంత్ సర్కార్ రియల్ ఎస్టేట్ బ్రోకర్‌లా మారింది

భూములను అనుచరులకు కట్టబెట్టే కుట్ర

ఇంచు స్థలం పోయినా ఊరుకోం

మూసీ ప్రక్షాళనకు మేం వ్యతిరేకం కాదు..

పేదల ఇళ్లు కూల్చొద్దు

రాష్ట్రంలో సమస్యలను గాలికొదిలి ఢిల్లీ పర్యటనలా?

అమిత్‌షా రాకతో కాంగ్రెస్‌లో వణుకు

బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్‌రావు విమర్శలు

హైదరాబాద్, అక్టోబర్ 30సామాన్యుడి అస్త్రం

కోర్టు తీర్పు వచ్చిందోలేదో మియా పూర్ భూములను వేలం వేయడానికి రేవంత్ సర్కార్ సిద్ధమవ్వడం సిగ్గుచేటని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రాంచందర్‌రావు మండిపడ్డారు. ప్రజా ఆస్తులను తన అనుచరులకు కట్టబెడుతున్న ఈ ప్రభుత్వం, ప్రజల పక్షాన నిలవాల్సింది పోయి రియల్ ఎస్టేట్ బ్రోకర్‌లా వ్యవహరిస్తోందన్నారు. మియాపూర్ భూముల వేలాన్ని అడ్డుకుని తీరుతామని స్పష్టం చేశారు. 'మేము మూసీ ప్రక్షాళనకు వ్యతిరేకం కాదు.. కానీ, సుందరీకరణ పేరుతో పేదల పొట్టగొట్టడాన్ని ఒప్పుకోం' అని పేర్కొన్నారు.రాష్ట్రంలో ప్రజా సమస్యలను గాలి కొదిలేసి, సీఎం రేవంత్‌రెడ్డి ఢిల్లీ చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారని దుయ్యబట్టారు. కేంద్ర హోంమంత్రి అమిత్‌షా తెలంగాణ అడుగుపెడుతుండటంతో కాంగ్రెస్ ప్రభుత్వానికి ఇప్పు డే వణుకు మొదలైనదన్నారు. శుక్రవారం బీజే పీ రాష్ట్ర కార్యాలయంలో రాష్ట్ర ఉపాధ్యక్షుడు బండారు శాంతికుమార్, పార్టీ రాష్ట్ర కార్యదర్శి ఓ.ఎస్. రెడ్డితో కలిసి ఆయన మీడియాతో మాట్లాడారు. అత్యంత విలువైన మియాపూర్ 550 ఎకరాల భూములపై సుప్రీంకోర్టు తీర్పు ను బీజేపీ స్వాగతిస్తుందని రాంచందర్‌రావు పేర్కొన్నారు.కోర్టు తీర్పు వెలువడిన వెంటనే ఏమాత్రం ఆగకుండా, భూములను వేలం వేసి అమ్మేస్తామని ప్రకటించడం కాంగ్రెస్ ప్రభుత్వ దివాళాకోరుతనానికి నిదర్శనమన్నారు. వేలం ముసుగులో భూములను అనుచరులకు కట్టబెట్టే కుట్ర జరుగుతుందని, ఒక్క ఇంచు పోయినా ఊరుకునేది లేదని హెచ్చరించారు. మియాపూర్ భూములను గత బీఆర్ఎస్ ప్రభుత్వం తమ బంధువులకు, ప్రైవేటు వ్యక్తులకు ధారాదత్తం చేయడానికి ప్రయత్నించిందని ఆరోపించారు.కేంద్రంలోని తమ ప్రభుత్వ ప్రయత్నం, న్యాయవా దుల కృషి వల్లే నేడు 500 ఎకరాల భూము లు ప్రభుత్వానికి దక్కాయన్నారు. 500 ఎకరాల భూములను నాడు బీఆర్ఎస్ ప్రభుత్వం తమ బంధువులకు కట్టబెట్టాలని చూసిందని, అయితే ఆ భూ ములను రేవంత్‌రెడ్డి కాజేయాలనే ఉద్దేశంతో అప్పట్లోనే అమ్మకాలను అడ్డుకునే ప్రయత్నం చేశారని ఆరోపించారు. ఈ భూములను వేలం పేరుతో తమ అనుచరులకే కట్టబెట్టేందుకు కుట్రలు పన్నుతున్నా రని మండిపడ్డారు. ప్రజా ఆస్తులను కొల్లగొట్టడంలో నాడు బీఆర్ఎస్, నేడు కాంగ్రెస్ పరస్పరం పోటీపడుతున్నాయని విమర్శించారు. కాంగ్రెస్ దోపిడీని ప్రజలతో కలిసి అడ్డుకుంటామని హెచ్చరించారు.బాధితులను పిలువకుండా పబ్లిక్ హియరింగా?మూసీ పునరుజ్జీవనం పేరిట కాంగ్రెస్ ప్రభుత్వం నిర్వహిస్తున్న పబ్లిక్ హియరింగ్ ప్రహసనంగా మారిందని రాంచందర్‌రావు విమర్శించారు. ప్రాజెక్టు వల్ల నష్టపోయే బాధితులను, నిర్వాసితులను పిలవకుండా పబ్లిక్ హియరింగ్ ఎలా నిర్వహిస్తారని నిలదీశారు. గాంధీ సరోవర్ ప్రాజెక్టు పరిధిలోని మధు పార్క్ ప్రాంతంలో ఎంతో మంది మాజీ సైనికులు నివసిస్తున్నారని, ఈనెల 28న హిమా యత్‌సాగర్ సమీపంలో మూసీ రివర్ ఫ్రంట్ కార్పొరేషన్ అధికారులు నిర్వహించిన సమావేశంలోకి అసలైన బాధితులను అనుమతిం చకపోవడం దారుణమన్నారు.గత బీఆర్ఎస్ ప్రభుత్వం మూసీ కార్పొరేషన్‌కు రూ.750 కోట్ల అంచనా వ్యయం చూపించి చివరకు రూ.3 కోట్లు మాత్రమే విదిల్చి చేతులు దులుపుకుందని, ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం వేల కోట్ల అంచనాలు చెబుతూ స్పష్టమైన డీపీఆర్, బడ్జెట్ కేటాయింపులు చూపకుండా ముందు కు వెళ్తోందని ఆరోపించారు. నిర్వాసితులకు నష్టపరిహారం, పునరావాసం కల్పించకుండా ఇళ్లు కూల్చేస్తామంటే ఊరుకోమని హెచ్చరించారు. బాధితులతో ప్రజాదర్బార్ నిర్వహించి, వారి సమస్యలు పరిష్కరించిన తర్వాతే ముందుకెళ్లాలని స్పష్టం చేశారు.

మాక్ పార్లమెంట్‌తో ప్రజాస్వామ్యం అపహాస్యం

కాంగ్రెస్ నేతృత్వంలోని ఇండీ కూటమి రాజ్యాంగ వ్యవస్థలను అవమానిస్తూ, మాక్ పార్లమెంట్ పేరిట ప్రజాస్వామ్య దేవాలయాలను అపహాస్యం చేస్తోందని రాంచందర్ రావు విమర్శించారు. విద్యార్థులు, యువత లో భవిష్యత్తు నాయకత్వ లక్షణాలను పెం పొందించేందుకు విద్యాసంస్థల్లో మాక్ అసెంబ్లీలు, పార్లమెంట్‌లు నిర్వహించడం సంప్రదా యమని, అయితే కాంగ్రెస్ పార్టీ మాత్రం వ్యవస్థలను భ్రష్టు పట్టించేందుకే ఇలాంటి నాటకాలు ఆడుతుందని మండిపడ్డారు. గతం లో సుప్రీంకోర్టును అవహేళన చేస్తూ రిటైర్డ్ జడ్జీలతో పిటిషన్లు తీసుకుంటూ 'కంగారూ కోర్టు' తరహా విచారణలు నడిపిన చరిత్ర కాం గ్రెస్‌దని మండిపడ్డారు.

వారణాసి బీజేపీ సీటు కాదు

ఇటీవల పలు రాష్ట్రాల్లో బ్యాలెట్ పేపర్‌తో జరిగిన ఎమ్మెల్సీ ఎన్నికల్లోనూ కాంగ్రెస్ ఓట మి పాలైందని రాంచందర్‌రావు విమర్శించా రు. 23 ఎమ్మెల్సీ స్థానాల్లో బీజేపీ ఏకంగా 16 స్థానాలు గెలుచుకుందని, బ్యాలెట్ పేపర్లలోనూ బీజేపీదే పైచేయి అని నిరూపితమైం దని పేర్కొన్నారు. వారణాసి మొదటి నుంచి బీజేపీ సిట్టింగ్ సీటు కాదని, 2014 కంటే ముందు నుంచి మొన్నటి వరకు సమాజ్‌వాదీ పార్టీయే అక్కడ ప్రాతినిధ్యం వహించిందని స్పష్టం చేశారు. నాగ్‌పూర్‌లోనూ గతంలో కాంగ్రెస్ ప్రాతినిధ్యం వహించిన స్థానమేనని వివరించారు. కర్ణాటక కాంగ్రెస్ మంత్రి సతీష్ జార్కిహోళి స్వయంగా తమ రాష్ట్రంలో సర్ ప్రక్రియ అత్యంత పారదర్శకంగా, నిబంధనల ప్రకారమే జరిగిందని రెండు రోజుల క్రితమే బహిరంగంగా ప్రకటించిన విషయాన్ని గుర్తుచేశారు.వారి సొంత మంత్రే ప్రక్రియను సమర్థిస్తుంటే, ఇక్కడ కాంగ్రెస్ నేతలు అసత్య ప్రచారం చేయడం హాస్యాస్పదమన్నారు. ఈ వీఎంలతో గెలిచిన కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ, సీఎం రేవంత్‌రెడ్డి తమ పదవులకు రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. ఇండీ కూటమి ర్యాలీ కోసం దక్షిణ మధ్య రైల్వే ప్రత్యేక రైళ్లను కేటాయించలేదని కాంగ్రెస్ చేస్తున్న విమర్శలను రాంచందర్‌రావు కొట్టిపారేశారు. నిబంధనల ప్రకారం ప్రత్యేక రైళ్ల బుకింగ్ నెలల ముందుగానే జరగాలని, నిర్ణీత రుసుము చెల్లించి అడ్వాన్స్ బుకింగ్ చేసుకోవాల్సి ఉంటుందని గుర్తుచేశారు.

కాంగ్రెస్‌ది రక్తచరిత్ర

వందలాది మంది తెలంగాణ బిడ్డల బలిదానాలకు కారణమై, చీకట్లో తలుపులు మూ సి రాష్ట్రాన్ని విభజించిన రక్తచరిత్ర కాంగ్రెస్‌దని రాంచందర్‌రావు విమర్శించారు. తెలం గాణ ప్రజలకు తాము క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేస్తున్న మంత్రి పొన్నం.. అసలు తెలంగాణకు బేషరతుగా క్షమాపణ చెప్పాల్సింది కాంగ్రెస్ నేతలేనని స్పష్టం చేశారు. గతంలో అన్యాయంగా ఓట్లు తొలగించారంటూ ఆరోపణలు చేసిన మంత్రి పొన్నం.. కనీసం పది మంది అర్హులైన ఓటర్ల ఆధారాలు చూపమంటే సమాధానం చెప్పలేక పారిపోయారని మండిపడ్డారు.ఆరు దశాబ్దాల పాలనలో బీసీ కమిషన్ నివేదికలను అటకెక్కించి, ఇప్పుడు బీసీ గణన పేరిట కాంగ్రెస్ మొసలి కన్నీరు కారుస్తోందని ఆక్షేపించారు. రాష్ట్రంలో తీవ్ర కరువు, తాగునీటి ఎద్దడితో ప్రజలు అల్లాడుతుంటే పరిష్కరించే తీరిక ప్రభుత్వానికి లేదన్నారు. హైదరాబాద్ లో జనం ట్యాంకర్ల వెంట పడుతుంటే సీఎం, మంత్రులు మాత్రం రాహుల్‌గాంధీ మెప్పు కోసం ఢిల్లీకి పరుగులు తీస్తున్నారని ఎద్దేవా చేశారు. హైడ్రా పేరుతో పేదల ఇళ్లను కూల్చుతున్న కాంగ్రెస్ ప్రభుత్వ అరాచకాలకు ప్రజలే బుద్ధి చెబుతారన్నారు. నవంబరు 2న అమిత్‌షా సమక్షంలో నిర్వహించే 'లోక్‌తంత్ర బచా వో' పాదయాత్రతో కాంగ్రెస్ ప్రజావ్యతిరేక పాలనకు అంతం పలుకుతామని రాంచందర్‌రావు హెచ్చరించారు. ఉమ్మడి నిజామాబాద్ జిల్లాకు చెందిన రిటైర్డ్ చీఫ్ ఇంజినీర్ హన్మంతరావుతో పాటు పలువురు ప్రముఖులు, రిటైర్డ్ ఉన్నతాధికారులు నిజామాబాద్ ఎంపీ ధర్మపురి అరవింద్ ఆధ్వర్యంలో బీజేపీలో చేరారు. వారికి రాంచందర్‌రావు పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు.

కీరదోస తింటే అనారోగ్యమా?



కీరదోసతో ఆరోగ్యానికి మేలు
కొందరికి జీర్ణ సమస్యలు వచ్చే అవకాశం
చేదు కీరదోస తినొద్దు
కొందరికి ఫుడ్ పాయిజనింగ్ ప్రమాదం
అరుదుగా అలర్జీ రావచ్చు

ఆరోగ్యకరమైన ఆహారంలో భాగంగా చాలా మంది కీరదోసకాయను తమ డైట్‌లో చేర్చుకుంటున్నారు. క్యారట్, బీట్‌రూట్‌తో పాటు దీన్నీ పచ్చిగా తినేందుకు ఆసక్తి చూపిస్తారు. ముఖ్యంగా బరువు తగ్గాలనుకునేవారు కచ్చితంగా తింటున్నారు.

ఇందులో ఫైబర్, నీటి శాతం ఎక్కువగా ఉండటంతో కడుపు నిండిన భావన కలుగుతుంది. తరచూ ఏదో ఒకటి తినాలనే కోరిక తగ్గుతుంది. దీంతో క్యాలరీల వినియోగం తగ్గి బరువు నియంత్రణకు తోడ్పడుతుంది. అయితే కీరదోసకాయ అందరికీ ఒకేలా సరిపోదని వైద్య నిపుణులు చెబుతున్నారు. కొందరిలో కొన్ని ఆరోగ్య సమస్యలకు కారణమయ్యే అవకాశం ఉందంటున్నారు. అవేంటో ఇప్పుడు తెలుసుకుందాం.

జీర్ణకోశ సమస్యలు

కీరలో ఉండే పీచు పదార్థాలు, సహజ రసాయనాలు కొందరిలో కడుపు ఉబ్బరం, గ్యాస్, కడుపు నొప్పి, అజీర్ణం వంటి సమస్యలకు దారితీయవచ్చు. ముఖ్యంగా జీర్ణకోశం సున్నితంగా ఉండేవారు ఎక్కువ పరిమాణంలో తింటే ఈ ఇబ్బందులు కనిపించే అవకాశం ఉంటుంది.

చేదుగా ఉంటే జాగ్రత్త

కొన్నిసార్లు దోసకాయ సాధారణం కంటే మరీ చేదుగా ఉంటుంది. దీనికి 'కుకుర్బిటాసిన్స్' అనే సహజ రసాయనాలే కారణం. స్వల్ప మోతాదులో ఇవి ప్రమాదకరం కాకపోయినా, ఎక్కువగా ఉన్న కీర తింటే వికారం, వాంతులు, కడుపు నొప్పి, విరేచనాలు వచ్చే ప్రమాదం ఉంది. అందుకే చేదుగా అనిపించిన దోసను వెంటనే పారేయడం మంచిది.

ఫుడ్ పాయిజనింగ్

ఇతర పచ్చి కూరగాయల్లాగే కీరపై కూడా హానికర బ్యాక్టీరియా చేరే అవకాశం ఉంటుంది. సరిగా కడగకుండా లేదా పరిశుభ్రంగా నిల్వ చేయకుండా తింటే ఫుడ్ పాయిజనింగ్‌కు గురయ్యే ప్రమాదం ఉంది. అలాంటి సమయంలో విరేచనాలు, జ్వరం, వాంతులు, కడుపు మంట, వికారం వంటి లక్షణాలు కనిపించవచ్చు.

అలర్జీ కూడా రావచ్చు

కీరతో అలర్జీ వచ్చే వారు చాలా తక్కువే. అయినా కొందరిలో నోరు, గొంతులో దురద, పెదవులు లేదా నాలుక వాపు, చర్మంపై దద్దుర్లు, గొంతు మంట వంటి లక్షణాలు కనిపించవచ్చు. తీవ్రమైన లక్షణాలు ఉంటే వెంటనే వైద్యుడిని సంప్రదించాలి.

తరచూ మూత్ర విసర్జన

దోసకాయలో నీటి శాతం ఎక్కువగా ఉంటుంది. అందుకే అధికంగా తింటే సాధారణం కంటే ఎక్కువసార్లు మూత్ర విసర్జన కావచ్చు. ఆరోగ్యంగా ఉన్నవారికి ఇది పెద్ద సమస్య కాదు. కానీ ఆరోగ్య సమస్యలు ఉన్నవారు వైద్యుల సూచనలు పాటించడం మంచిది.

ఇలా తింటే సేఫ్

కీరదోసకాయ తినే ముందు బాగా కడగాలి. శుభ్రమైన, చల్లని ప్రదేశంలో నిల్వ చేయాలి. చేదు రుచి ఉన్న కీర తినకూడదు. మితంగా తీసుకోవాలి. జీర్ణకోశ సమస్యలు ఉన్నవారు తొక్క తీసి తింటే మంచిది.

99 శాతం గుండెపోట్లకు ఈ నాలుగే కారణాలు..



ప్రపంచవ్యాప్తంగా లక్షలాది మంది ప్రాణాలు తీస్తున్న గుండెపోటు, స్ట్రోక్, గుండె వైఫల్యం వంటి తీవ్రమైన ఆరోగ్య సమస్యలు ఎలాంటి హెచ్చరిక లేకుండా అకస్మాత్తుగా రావని, వాటి వెనుక స్పష్టమైన కారణాలుంటాయని ఒక భారీ అంతర్జాతీయ అధ్యయనం తేల్చింది. మొదటిసారి ఇలాంటి సమస్యల బారిన పడిన వారిలో 99 శాతం మందికి, ఆ జబ్బులు రావడానికి కొన్నేళ్ల ముందే నాలుగు ప్రధాన ప్రమాద కారకాల్లో కనీసం ఒకటి ఉన్నట్లు ఈ పరిశోధనలో వెల్లడైంది. అధిక రక్తపోటు (హై బీపీ), అధిక కొలెస్ట్రాల్, రక్తంలో అధిక చక్కెర స్థాయిలు (డయాబెటిస్), పొగాకు వాడకం అనేవి ఆ నాలుగు ప్రమాద కారకాలని పరిశోధకులు గుర్తించారు.సౌత్ కొరియాలోని యోన్సీ యూనివర్సిటీ, అమెరికాకు చెందిన నార్త్‌వెస్టర్న్ మెడిసిన్ పరిశోధకులు సంయుక్తంగా ఈ అధ్యయనం నిర్వహించారు. దీని కోసం సౌత్ కొరియాలో 93 లక్షల మంది, అమెరికాలో దాదాపు 7,000 మంది వయోజనుల ఆరోగ్య డేటాను సుమారు రెండు దశాబ్దాల పాటు విశ్లేషించారు. గుండె సంబంధిత సమస్యలు వచ్చిన వారిలో 93 శాతం కంటే ఎక్కువ మందికి, ఈ నాలుగింటిలో రెండు లేదా అంతకంటే ఎక్కువ ప్రమాద కారకాలు ముందుగానే ఉన్నట్లు కనుగొన్నారు. ఈ అధ్యయన ఫలితాలు ప్రముఖ 'జర్నల్ ఆఫ్ ది అమెరికన్ కాలేజ్ ఆఫ్ కార్డియాలజీ'లో ప్రచురితమయ్యాయి.ఈ పరిశోధన ప్రకారం, అన్ని ప్రమాద కారకాల్లోకెల్లా అధిక రక్తపోటు అత్యంత సాధారణంగా కనిపించింది. సౌత్ కొరియాలో 95 శాతం, అమెరికాలో 93 శాతం కేసుల్లో బాధితులకు ముందు నుంచే హై బీపీ ఉన్నట్లు తేలింది. సాధారణంగా తక్కువ ప్రమాదం ఉంటుందని భావించే 60 ఏళ్లలోపు మహిళల్లో కూడా ఇదే ధోరణి కనిపించడం ఆందోళన కలిగించే విషయం.ఈ నాలుగు ప్రమాద కారకాలను జీవనశైలి మార్పులు, సరైన మందుల వాడకంతో పూర్తిగా నియంత్రించవచ్చని నిపుణులు స్పష్టం చేస్తున్నారు. రక్తపోటు, కొలెస్ట్రాల్, షుగర్ స్థాయిలను క్రమం తప్పకుండా పరీక్షించుకోవడం, పొగాకుకు దూరంగా ఉండటం ద్వారా గుండె జబ్బుల ముప్పును గణనీయంగా తగ్గించుకోవచ్చని సూచిస్తున్నారు. సమస్య తీవ్రం కాకముందే, స్వల్ప స్థాయిలో ఉన్నప్పుడే గుర్తించి జాగ్రత్తలు తీసుకోవడం ఎంతో ముఖ్యమని ఈ అధ్యయనం నొక్కి చెబుతోంది.

'బారామాసి' మామిడి మొక్కలు..
బాల్కనీలో పెంచుకోవచ్చు..

పట్టణాల్లో బాల్కనీలు, డాబాలపై బారామాసి మామిడి మొక్కల పెంపకం
ఏడాది పొడవునా కాపునివ్వడమే ఈ రకాల ప్రధాన ఆకర్షణ
నాటిన 12 నెలల్లోనే ఫలసాయం అందించే హైబ్రిడ్ వెరైటీలు
కుండీల్లో పెంచడానికి అనువైన కాటిమోన్, సదాబహార్ రకాలకు ఆదరణ
తీపి రుచి, పీచులేని గుజ్జుతో ఈ పండ్లు ప్రత్యేకం



పట్టణ ప్రాంతాల్లో ఇంటి పంటల సాగుపై ఆసక్తి పెరుగుతున్న నేపథ్యంలో, ప్రస్తుతం అనేకమంది 'బారామాసి' మామిడి రకాలను పెంచేందుకు మొగ్గు చూపుతున్నారు. బాల్కనీలు, డాబాలపై చిన్న కుండీల్లో సైతం ఇవి సులభంగా పెరుగుతూ, ఏడాది పొడవునా ఫలసాయాన్ని ఇస్తుండటంతో వీటికి ఆదరణ విశేషంగా పెరుగుతోంది.'బారామాసి' అంటే హిందీలో పన్నెండు నెలలు అని అర్థం. సాధారణ మామిడి రకాలతో పోలిస్తే, ఇవి ఏడాదిలో పలుమార్లు పూత పూసి కాయలు కాస్తాయి. ముఖ్యంగా అంటుకట్టిన హైబ్రిడ్ మొక్కలు పొట్టిగా ఉండి, కుండీల్లో పెంచడానికి ఎంతో అనువుగా ఉంటాయి. సాంప్రదాయ మామిడి రకాలు నాటిన తర్వాత ఫలసాయం ఇవ్వడానికి సుమారు 4 నుండి 5 ఏళ్ల సమయం పడితే, ఈ బారామాసి రకాలు కేవలం 9 నుండి 12 నెలల్లోనే పంటను చేతికి అందిస్తాయి.ప్రస్తుతం కాటిమోన్ (థాయ్‌లాండ్ రకం), ఎరుపు రంగుతో ఆకట్టుకునే హాంగ్ సియాంగ్ (రెడ్ డ్రాగన్), చీడపీడలను సమర్థవంతంగా తట్టుకునే దేశీయ రకమైన 'సదాబహార్' వంటివి విశేష ప్రాచుర్యం పొందాయి. ఈ మొక్కలు ఆరోగ్యంగా పెరగడానికి నీరు నిల్వ ఉండని సారవంతమైన మట్టి, ప్రతిరోజూ కనీసం 6 నుంచి 8 గంటల పాటు ప్రత్యక్ష సూర్యరశ్మి, తీవ్రమైన చలి నుంచి రక్షణ అవసరం. 20 డిగ్రీల నుంచి 38 డిగ్రీల మధ్య ఉండే ఉష్ణోగ్రతలు వీటికి అత్యంత అనుకూలమని నిపుణులు సూచిస్తున్నారు.ఈ బారామాసి పండ్లు కమ్మని తీపి, స్వల్పమైన పులుపు కలయికతో ఎంతో రుచికరంగా ఉంటాయని సాగుదారులు చెబుతున్నారు. పీచు లేకుండా, ఆకర్షణీయమైన బంగారు పసుపు రంగు గుజ్జుతో ఉండే ఈ పండ్లు వినియోగదారులను ఆకట్టుకుంటున్నాయి. సరైన వాతావరణం, తగినంత సంరక్షణ ఉంటే నగరవాసులు సైతం తమ బాల్కనీలు, మిద్దె తోటల్లోనే రసవత్తరమైన మామిడి పండ్లను పండించుకునే అద్భుత అవకాశాన్ని ఈ బారామాసి రకాలు కల్పిస్తున్నాయి.

అన్నం వండే ముందు బియ్యం కడగడం మంచిదా? కాదా?

అన్నం వండే ముందు బియ్యం కడగడంపై నిపుణుల విశ్లేషణ
బియ్యం కడగడం వల్ల అదనపు పిండిపదార్థం, మైక్రోప్లాస్టిక్స్ తొలగిపోతాయి
స్వల్పంగా పోషకాలు నష్టపోయే అవకాశం ఉందని వెల్లడి
ఆర్సెనిక్ తగ్గాలంటే కడగడం కన్నా గంజి వార్చడమే ఉత్తమమని సూచన



అన్నం వండే ముందు బియ్యాన్ని కడగడం దాదాపు అన్ని ఇళ్లలోనూ ఉండే సాధారణ అలవాటు. అయితే ఈ పద్ధతి వల్ల కలిగే లాభనష్టాలపై నిపుణులు కీలక విషయాలను వెల్లడించారు. బియ్యాన్ని కడగడం వల్ల అన్నం పొడిపొడిగా రావడమే కాకుండా, కొన్ని రకాల కాలుష్య కారకాలు కూడా తొలగిపోతాయని వారు చెబుతున్నారు. అదే సమయంలో, స్వల్ప మొత్తంలో పోషకాలు నష్టపోయే అవకాశం ఉందని కూడా వివరిస్తున్నారు.ఆస్ట్రేలియాలోని అడిలైడ్ యూనివర్సిటీకి చెందిన ఆహార శాస్త్రవేత్తల ప్రకారం, బియ్యంపై ఉండే అదనపు పిండి పదార్థం (స్టార్చ్) కడగడం ద్వారా తొలగిపోతుంది. దీనివల్ల అన్నం అతుక్కోకుండా పొడిపొడిగా వస్తుంది. సాగు సమయంలో నీరు, నేల ద్వారా బియ్యానికి చేరే ఆర్సెనిక్ వంటి హానికారకాలు కూడా కొంతవరకు తొలగిపోతాయని ఆహార శాస్త్రవేత్త పర్మల్ డియో తెలిపారు. 2021లో జరిగిన ఒక అధ్యయనం ప్రకారం, బియ్యాన్ని కడగడం వల్ల 20 నుంచి 40 శాతం వరకు మైక్రోప్లాస్టిక్స్ కూడా తగ్గుతాయని తేలింది.అయితే, బియ్యాన్ని కడిగే క్రమంలో కాపర్, ఐరన్, జింక్ వంటి నీటిలో కరిగే కొన్ని పోషకాలను కూడా కోల్పోయే అవకాశం ఉందని నిపుణులు పేర్కొంటున్నారు. అయితే, సమతుల్య ఆహారం తీసుకునే వారికి ఈ నష్టం చాలా స్వల్పమని, దీనివల్ల ఆరోగ్యానికి పెద్దగా ఇబ్బంది ఉండదని డైటీషియన్ ఇవాంజెలిన్ మాంట్జియోరిస్ స్పష్టం చేశారు. ప్రస్తుత సూపర్ మార్కెట్లలో లభించే బియ్యం ఇప్పటికే శుద్ధి చేసి వస్తుండటంతో, కేవలం రుచి లేదా కాలుష్యాల తొలగింపు కోసమే కడగాల్సి ఉంటుందని మరో శాస్త్రవేత్త బో వాంగ్ వివరించారు.నిపుణుల సలహా ప్రకారం, రుచి కోసం ఒకటి లేదా రెండు సార్లు బియ్యాన్ని సున్నితంగా కడగడం ఉత్తమం. దీనివల్ల పోషక నష్టం పెద్దగా జరగదు. ఆర్సెనిక్ వంటి హానికారకాల పట్ల ఆందోళన ఉన్నవారు, బియ్యాన్ని కడగడంతో పాటు ఎక్కువ నీటిలో ఉడికించి, గంజిని వార్చివేయడం మేలని శాస్త్రీయ అధ్యయనాలు సూచిస్తున్నాయి. ఈ పద్ధతి ద్వారా ఆర్సెనిక్ శాతాన్ని 40 నుంచి 60 శాతం వరకు తగ్గించవచ్చని తేలింది.

చక్కెర పూర్తిగా మానేస్తే ప్రమాదమా?
కొత్త అధ్యయనం ఏం చెబుతోంది



పూర్తిగా మానేయడంపై పరిశోధనల్లో సందేహాలు
పేగుల ఆరోగ్యంపై ప్రభావం
ఇన్సులిన్ నిరోధకత పెరిగినట్లు గుర్తింపు
అధిక చక్కెర మాత్రం హానికరమే
బ్యాలెన్స్‌డ్ ఉత్తమమంటున్న నిపుణులు

బరువు తగ్గాలన్నా, షుగర్‌ను అదుపులో పెట్టాలన్నా చాలా మంది ముందుగా చేసే పని చక్కెరను తగ్గించడం. కొందరైతే పూర్తిగా మానేయడానికే ప్రయత్నిస్తారు. చక్కెర ఎంత తక్కువగా తీసుకుంటే అంత మంచిదనే అభిప్రాయం చాలా మందిలో ఉంది. అయితే చక్కెరను పూర్తిగా ఆహారం నుంచి తొలగించడం వల్ల కూడా కొన్ని అనుకోని సమస్యలు రావొచ్చని తాజా అధ్యయనం చెబుతోంది. అమెరికాలో జరిగిన ఎండో 2026 సదస్సులో వెల్లడైన ఈ పరిశోధన ప్రస్తుతం ఆసక్తికర చర్చకు దారితీసింది.

చక్కెర లేకపోతే ఏమైంది?

పరిశోధకులు ఎలుకలను రెండు గ్రూపులుగా విభజించి 16 వారాల పాటు అధ్యయనం చేశారు. ఒక గ్రూపునకు చక్కెర ఉన్న తక్కువ కొవ్వు ఆహారం ఇవ్వగా మరో గ్రూపునకు చక్కెర లేని అదే తరహా ఆహారం అందించారు. తర్వాత రక్తంలో చక్కెర స్థాయిలు, ఇన్సులిన్ పనితీరు, పేగుల్లోని సూక్ష్మజీవులు, కాలేయ ఆరోగ్యం వంటి అంశాలను పరిశీలించారు. ఆశ్చర్యకరంగా, చక్కెర పూర్తిగా మానేసిన ఎలుకల్లో బరువు పెద్దగా తగ్గలేదు. పైగా రక్తంలో చక్కెర నియంత్రణ దెబ్బతినడం, ఇన్సులిన్ నిరోధకత పెరగడం, పేగుల ఆరోగ్యం బలహీనపడడం, కాలేయంలో వాపు వంటి సమస్యలు కనిపించాయి. దీంతో చక్కెరను పూర్తిగా తొలగించడం సరైన నిర్ణయం కాకపోవచ్చని పరిశోధకులు అభిప్రాయపడ్డారు.

పేగుల ఆరోగ్యంతో సంబంధం ఏంటి?

మన పేగుల్లో లక్షల కోట్ల సూక్ష్మజీవులు ఉంటాయి. ఇవే జీర్ణక్రియ నుంచి రోగనిరోధక శక్తి వరకు అనేక పనుల్లో కీలక పాత్ర పోషిస్తాయి. ఈ సూక్ష్మజీవుల బ్యాలెన్స్ దెబ్బతింటే ఊబకాయం, మధుమేహం, కాలేయ సమస్యల వంటి అనారోగ్య పరిస్థితులు వచ్చే ప్రమాదం ఉంటుంది. చక్కెరను పూర్తిగా మానేసిన ఎలుకల్లో ఈ సమతుల్యతలో మార్పులు కనిపించినట్లు అధ్యయనం వెల్లడించింది.

అంటే చక్కెర ఎక్కువగా తినాలా?

అధికంగా చక్కెర తీసుకోవడం వల్ల ఊబకాయం, టైప్-2 డయాబెటిస్, గుండె సంబంధిత వ్యాధుల ప్రమాదం పెరుగుతుందని వైద్య నిపుణులు స్పష్టం చేస్తున్నారు. ఈ అధ్యయనం చెప్పేది ఒక్కటే. చక్కెరను అధికంగా తీసుకోవడం హానికరం. అలాగే పూర్తిగా మానేయడం కూడా కొన్ని సందర్భాల్లో ప్రతికూల ప్రభావాలు చూపవచ్చు. అందుకే బ్యాలెన్స్‌డ్ డైట్ ఉత్తమమని పరిశోధకులు సూచిస్తున్నారు.

ఈ అధ్యయనం ఎలుకలపై మాత్రమే జరిగింది. మనుషులపై మరింత లోతైన పరిశోధనలు జరగాల్సి ఉంది.

ముహూర్తం కుదిరింది!

గ్లోబల్ స్టార్ రామ్‌చరణ్, లెక్కల మాస్టర్ సుకుమార్(కాంబోలో తెరకెక్కనున్న పాన్ ఇండియా చిత్రం 'ఆర్సీ 17' ముహూర్తపు వేడుకకు సమయం ఆసన్నమైంది. నవంబర్ 1న ఈ సినిమా ప్రారంభోత్సవాన్ని నిర్వహించనున్నట్లు సినీ వర్గాల సమాచారం. మైత్రీ మూవీ మేకర్స్, సుకుమార్ రైటింగ్స్ ఈ చిత్రాన్ని నిర్మించనున్నాయి. ఇదిలా వుండగా, ఈ సినిమాలో హీరోయిన్ విషయమై ఇండస్ట్రీలో ఆసక్తికర వార్త హల్‌చల్ చేస్తోంది. ఇటీవల 'ధురంధర్'తో పాన్ ఇండియా రేంజ్‌లో గుర్తింపు తెచ్చుకున్న సారా అర్జున్ ఈ చిత్రంలో కథానాయికగా ఎంపికైనట్లు తెలుస్తోందిరామ్‌చరణ్ సరసన సారా అర్జున్ నటించడం ఇదే తొలిసారి. సుకుమార్ మార్క్ క్యారెక్టరైజేషన్‌కు ఆమె సరిగ్గా సరిపోతుందని చిత్రబృందం భావించినట్లు టాలీవుడ్ టాక్. ఈ క్రేజీ ప్రాజెక్ట్ కోసం ఇప్పటికే ప్రీ-ప్రొడక్షన్ పనులు శరవేగంగా జరుగుతున్నాయి. సినిమా ప్రారంభోత్సవానికి ముందే హైదరాబాద్‌లో నటీనటులపై ప్రత్యేక లుక్ టెస్ట్, ఫొటోషూట్ నిర్వహించినట్లు సమాచారం.ముందుగా హీరోయిన్ సారా అర్జున్‌పై ఫొటోషూట్ పూర్తి కాగా, ఆ మరుసటి రోజే హీరో రామ్ చరణ్‌పై కూడా సరికొత్త మేకోవర్ కోసం లుక్ టెస్ట్ సెషన్స్ పూర్తి చేసినట్లు ఫిలింనగర్ టాక్. రామ్ చరణ్‌ను మునుపెన్నడూ చూడని ఒక విభిన్నమైన లుక్‌లో సుకుమార్ చూపించబోతున్నారని తెలుస్తోంది. ట్రెండ్ సెట్టింగ్ మ్యూజిక్ డైరెక్టర్ అనిరుధ్ రవిచందర్ ఈ చిత్రానికి స్వరాలు అందిస్తాని భోగట్టా. నవంబర్ 1న జరిగే పూజా కార్యక్రమాల అనంతరం త్వరలోనే రెగ్యులర్ షూటింగ్ ప్రారంభం కానుంది. చిత్రబృందం నుంచి దీనిపై అధికారిక ప్రకటన వెలువడాల్సి ఉంది.



జనస్థాన్ రాజకుమారి వచ్చింది!



నినితేశ్ తివారీ దర్శకత్వంలో నమిత్ మల్హోత్రా తెరకెక్కిస్తున్న చిత్రం 'రామాయణం('. ప్రైమ్ ఫోకస్ స్టూడియోస్, డీఎన్ఈజీ, మాన్‌స్టర్ మైండ్ క్రియేషన్స్ సంయుక్తంగా నిర్మిస్తున్నాయి. ఇందులో శ్రీరాముడిగా రణ్‌బీర్ కపూర్, సీతమ్మగా సాయిపల్లవి, రావణుడిగా యశ్, హనుమంతుడిగా సన్నీ డియోల్, లక్ష్మణుడిగా రవి దూబే, శూర్పణఖ పాత్రలో రకుల్ ప్రీత్ సింగ్ నటిస్తున్నారు.తాజాగా ఈ చిత్రం నుంచి శూర్పణఖ పాత్రలో నటిస్తున్న రకుల్ ప్రీత్ సింగ్ లుక్‌ను మేకర్స్ విడుదల చేశారు. 'జనస్థాన్ కీ రాజకుమారి.. శూర్పణఖ' అంటూ పరిచయం చేసిన ఈ పోస్టర్ ఆకట్టుకుంటోంది. రెండు భాగాలుగా రూపొందుతున్న ఈ ఎపిక్‌లో ఫస్ట్ పార్ట్ ఈ నవంబర్ 5న హిందీ, తమిళం, తెలుగు, కన్నడ, మలయాళ భాషల్లో విడుదల కానుంది. రెండో భాగం 2027 దీపావళికి ప్రేక్షకుల ముందుకు రానుంది. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌లో ఈ సినిమాను ప్రముఖ డిస్ట్రిబ్యూషన్ సంస్థ ఎస్వీసీ రిలీజ్ చేయనుంది.

'ఛావా' డైరెక్టర్ నుంచి మరో బయోపిక్..

బాలీవుడ్ నటి శ్రద్ధా కపూర్ ప్రధాన పాత్రలో నటిస్తున్న కొత్త చిత్రం 'ఈథా'. మహారాష్ట్రకు చెందిన ప్రముఖ లావణీ కళాకారిణి విఠాబాయి నారాయణ్‌గావ్‌కర్ జీవితం ఆధారంగా ఈ బయోపిక్ తెరకెక్కుతోంది. 'ఛావా' వంటి బ్లాక్‌బస్టర్ చిత్ర దర్శకుడు లక్ష్మణ్ ఉటేకర్ దీనికి దర్శకత్వం వహిస్తున్నారు. తాజాగా ఈ సినిమా ట్రైలర్‌ను మేకర్స్ విడుదల చేశారు.మహారాష్ట్ర జానపద సంస్కృతిలో భాగమైన లావణీ నృత్యంలో ఆరితేరిన విఠాబాయి పాత్రలో శ్రద్ధా కపూర్ ఒదిగిపోయినట్లు ట్రైలర్ చూస్తే అర్థమవుతోంది.



డ్రాగన్ 'ఓపెన్‌హైమర్'ను మించిపోతుందట

మ్యాన్ ఆఫ్ మాసెస్ జూనియర్ ఎన్టీఆర్, దర్శకుడు ప్రశాంత్ నీల్ కలయికలో తెరకెక్కుతున్న 'డ్రాగన్' సినిమాపై భారీ అంచనాలు నెలకొన్నాయి. తాజాగా ఈ చిత్రంలో నటిస్తున్న సీనియర్ నటుడు రాజీవ్ కనకాల ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. ఎన్టీఆర్--ప్రశాంత్ నీల్ కాంబినేషన్ అణుబాంబు లాంటిదని అభివర్ణించారుఈ సినిమా అద్భుతంగా రూపుదిద్దుకుంటోందని రాజీవ్ కనకాల తెలిపారు. అభిమానులు మరోసారి కాలర్లు ఎగరేసుకునేలా సినిమా ఉంటుందని ధీమా వ్యక్తం చేశారు. అంతేకాదు, హాలీవుడ్ చిత్రం 'ఓపెన్‌హైమర్' స్థాయిని మించి ఈ సినిమా ఉంటుందనే తన అభిప్రాయాన్ని వెల్లడించారు. ఆయన వ్యాఖ్యలు ఇప్పుడు చిత్రంపై అంచనాలను మరింత పెంచుతున్నాయి.




'ఆదర్శ కుటుంబం' మూవీ రివ్యూ




కుటుంబ సినిమాలకు కేరాఫ్ అడ్రస్ కథానాయకుడు వెంకటేష్. ఫ్యామిలీ ఎంటర్‌టైనర్ సినిమాలను తనదైన శైలిలో తెరకెక్కించే దర్శకుడు త్రివిక్రమ్ శ్రీనివాస్.. ఇక ఇద్దరి కలయికలో సినిమా కోసం గత కొంత కాలంగా ప్రేక్షకులు ఎదురుచూస్తున్నారు. ఎట్టకేలకు ఈ ఇద్దరి కాంబినేషన్‌లో రూపొందిన చిత్రమే 'ఆదర్శ కుటుంబం'. యాక్షన్ ప్యాక్డ్ ఫ్యామిలీ ఎంటర్‌టైనర్‌కు ఆసక్తికరమైన క్రైమ్ మిస్టరీ నేపథ్యంలో తెరకెక్కిన ఈ సినిమా ప్రేక్షకులను అలరించిందా? వెంకీ-త్రివిక్రమ్‌ల జోడీ ఆడియన్స్‌కు ఎంటర్‌టైన్‌మెంట్ అందించిందా? లేదా తెలుసుకుందాం.. చిట్టిబాబు (వెంకటేష్) ఓ మిడిల్ క్లాస్ ప్రవైట్ ఉద్యోగి. భార్య స్వర్ణ (నిధి) చిట్‌ఫండ్స్ బిజినెస్‌లో మోసపోయి అప్పులపాలవుతుంది. ఇక చదువు అంతంత మాత్రమే ఉంటూ గుండెలో రంధ్రంతో బాధపడే కొడుకు సర్వ (ప్రజ్వల్). మెకానిక్‌తో ప్రేమాయణం నడుపుతూ కాలేజీలో చదువుకునే అమ్మాయి సంపూర్ణ (యువీనా).. ఇలా కుటుంబ సభ్యులతోనే పలు సమస్యలతో బాధపడే చిట్టిబాబుకు లాటరీలో రూ.100 కోట్లు వస్తాయి. అప్పటి వరకు అద్దె ఇంట్లో సర్దుకుపోయిన ఈ కుటుంబం ఒక్కసారిగా ఓ రిచ్ గెటెడ్ కమ్యూనిటీలో హౌస్ నెం.47 అనే విల్లాకు మారిపోతారు. ఖరీదైన కారును కొనుగోలు చేస్తారు. ఇదే సమయంలో ఖరీదైన కుటుంబాలను లక్ష్యంగా చేసుకుని దోచుకునే బీహార్ గ్యాంగ్ దోపిడి ముఠా దృష్టి చిట్టిబాబు ఫ్యామిలీపై పడుతుంది. అప్పుడు ఏం జరిగింది? ఆ బీహార్ గ్యాంగ్‌ను చిట్టిబాబు ఎలా ఎదుర్కొన్నాడు? తమ కుటుంబాన్ని కాపాడుకోవడానికి చిట్టిబాబు కుటుంబం చేసిన సాహసాలేంటి? ఇందుకోసం ఈ కుటుంబానికి పోలీస్ ఆఫీసర్ దామోదర్ నాయుడు (నారా రోహిత్) ఎలాంటి సహకారాన్ని అందించాడు? ఈ కథకు డీఎస్పీ బృహస్పతి రావు (రావు రమేష్) కు ఉన్న సంబంధమేమిటి? మాలతి (నివేదా పేతురాజ్), చిత్తరంజన్ (సత్య) పాత్రలు ఈ సినిమాలో ఏమిటి? అనేది సినిమా చూసి తెలుసుకోవాలి. త్రివిక్రమ్ సినిమా అంటే క్లీన్ ఫ్యామిలీ ఎంటర్‌టైనర్‌లు అని అనుకునే ప్రేక్షకులకు ఈ సినిమా కొత్తగా అనిపించే విధంగా తన బలమైన ఫ్యామిలీ ఎమోషన్స్‌కు.. యాక్షన్.. క్రైమ్ అంశాలను జోడించి దర్శకుడు త్రివిక్రమ్ ఈసినిమాను తెరకెక్కించాడు. ఈ సినిమా ఫస్టాఫ్ అంతా త్రివిక్రమ్ స్టయిల్ ఆఫ్ ఎంటర్‌టైన్‌మెంట్‌తో.. వెంకటేష్ తరహా ఫ్యామిలీ అంశాలతో కొనసాగుతుంది.

9వ నెలలోనూ సమంత వర్కౌట్లు..

ప్రముఖ నటి సమంత ప్రస్తుతం తన ప్రెగ్నెన్సీలో చివరి దశను ఆస్వాదిస్తున్నారు. త్వరలోనే పండంటి బిడ్డకు జన్మనివ్వబోతున్న ఆమె, గర్భంతో ఉన్నప్పటికీ తన ఫిట్‌నెస్ పట్ల ఏమాత్రం రాజీ పడటం లేదు. తాజాగా తొమ్మిదో నెలలోకి అడుగుపెట్టిన సందర్భంగా తన గర్భధారణ ప్రయాణంలో ఫిట్‌నెస్ ఎంత ముఖ్యమో తెలియజేస్తూ ఒక స్ఫూర్తిదాయక వీడియోను సోషల్ మీడియాలో పంచుకున్నారు. 'చ9. ది ఫైనల్ ల్యాప్' (చివరి అంకం) అనే క్యాప్షన్‌తో ఆమె చేసిన ఈ పోస్ట్ ఇప్పుడు వైరల్ అవుతోంది.ఈ వీడియోలో సమంత తన గర్భం దాల్చిన మొదటి నెల నుంచి తొమ్మిదో నెల వరకు వివిధ దశల్లో చేసిన వర్కౌట్లను చూపించారు. ముఖ్యంగా, లేటెస్ట్ క్లిప్‌లో ఆమె ఛాతీకి దగ్గరగా డంబెల్ పట్టుకుని వెయిటెడ్ స్క్వాట్స్ చేయడం అందరినీ ఆకట్టుకుంటోంది. గర్భం కారణంగా తన శరీరం మార్పులకు అనుగుణంగా వ్యాయామ దినచర్యను ఎలా మార్చుకున్నారో





సమంత గతంలోనే వివరించారు."ఈ రోజుల్లో ట్రైనింగ్ కాస్త భిన్నంగా ఉంది. ఎక్కువగా శ్రమించడం కంటే, శరీరంచెప్పేది వినడంపైనే ఎక్కువ దృష్టి పెడుతున్నాను" అని ఆమె గతంలో ఒక వర్కౌట్ పోస్ట్‌లో పేర్కొన్నారు. ఇప్పుడు ఆమె షేర్ చేసిన వీడియో కూడా అదే విషయాన్ని స్పష్టం చేస్తోంది.కాగా, సమంత తన భర్త, ప్రముఖ ఫిల్మ్‌మేకర్ రాజ్ నిడిమోరుతో కలిసి తమ తొలి బిడ్డకు స్వాగతం పలకనున్నారు. కొద్ది వారాల క్రితం, ఈ జంట కోయంబత్తూరులోని సద్గురు ఈశా ఫౌండేషన్‌లో తమ కుటుంబ సభ్యులు, సన్నిహితుల మధ్య సంప్రదాయబద్ధంగా సీమంతం వేడుకను జరుపుకున్నారు. సమంత, రాజ్ 2025 డిసెంబర్‌లో ఇదే ఈశా యోగా సెంటర్‌లోని లింగ భైరవి ఆలయంలో వివాహం చేసుకున్న విషయం తెలిసిందే.సమంత పోస్ట్‌పై నటి కృతి కర్బందా స్పందిస్తూ.. "మీ ముగ్గురికీ నా ప్రేమ" అంటూ కామెంట్ చేశారు. సమంత ఫిట్‌నెస్ స్ఫూర్తిపై అభిమానులు, తోటి నటీనటులు ప్రశంసలు కురిపిస్తున్నారు. గర్భంతో ఉన్నప్పటికీ చురుకుగా ఉంటూ ఎంతో మందికి ఆమె ఆదర్శంగా నిలుస్తున్నారు.

PRINTED AND PUBLISHED BY PANUTULA PRIYANKA, ON BEHALF OF PANUTULA PRIYANKA, PRINTED AT M/S.PARAHUSHAR PRINTING PUBLICATION, 1-4-36, SRINAGAR COLONY, MAHABUBABAD, WARANGAL TELANGANA -506101.AND PUBLISHED AT #H.NO.12-155, RAVINDER REDDY COMPLEX, NEAR HANUMANTEMPLE, IDA BOLLARAM MUNICIPALITY, JINNARAM MANDAL, SANGAREDDY DIST - 502325, TELANGANA STATE. EDITOR: PANUTULA PRIYANKA. RNI NO: TGTEL/25/A1872, Email: mathrubhoomiceo@gmail.com, Phone: 9182698313.